యేసుక్రీస్తు అందరికీ ప్రభువు ★

# క్రైస్తవనాడు

ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక

RNI APTEL / 2006 / 17980
Postal Regd.No. Vsp- 142 / 2015-2017

CHRISTAVANAADU
TELUGU FORTNIGHTLY, REGD. NEWS PAPER

POST BOX NO. : 2, OLD DAIRY FARM POST, ADARSHANAGAR,
VISAKHAPATNAM - 530 040. ANDHRA PRADESH, INDIA.
Call : 9346960601, 9490266640.
christavanaadu@gmail.com & christavanaadu1@yahoo.co.in

సంపుటి : 9 సంచిక : 15
ఎడిటర్ : వై.కనకరాజు
₹:5
2015 మే 16-31 పేజీలు : 8

PUBLISHED FROM VISAKHAPATNAM

రాబోవు దినములలో చిరకాలము వరకు నిత్యము సాక్ష్యార్థముగానుండునట్లు నీవు వెళ్లి వారి యెదుట పలకమీద దీని వ్రాసి గ్రంథములో లిఖింపుము ★ వచ్చుతరము తెలిసికొనునట్లుగా ఇది వ్రాయబడవలెను సృజింపబడబోవు జనము యెహోవాను స్తుతించును ★ ఈ మాటలు నమ్మకమును నిజమునైయున్నవి గనుక వ్రాయుమని ఆయన నాతో చెప్పుచున్నాడు ★

మర్మగర్భ వివరణలు..
అనేక ప్రశ్నలకు.. సందేహాలకు
సమాధానాలు ఒకే చోట!
'క్రైస్తవనాడు'
**10వ, సంవత్సరంలో ...**

లేఖనాల్లోగల మీకు తెలిసిన మర్మగర్భ సంగతులను ప్రచురించుకునే అవకాశం మీకుంది. సంప్రదించగలరు. ప్రార్థనలతోను సహకరించగలరు.




ఈ దేవుడు సదాకాలము మనకు దేవుడైయున్నాడు మరణ పర్యంతము ఆయన మనలను నడిపించును. ★ ఆయన నా దేవుడు ఆయనను వర్ణించెదను ★

(గత సంచిక తరువాయి) ఆయన చేసినది యావత్తూ మనకోసమేనన్నది నిజమని మీకన్పిస్తే ఆయన ఎందుకు చేసుంటారు? అన్న ప్రశ్నకూడా మీకు ఉదయించాలి. అది తెలుసుకోవాలంటే దేవుని జ్ఞాన గ్రంథమని మనం నమ్మే బైబిలును పరిశోధించుట తప్పనిసరి. బైబిల్లో క్రీస్తుకు పూర్వం వ్రాయబడి, మహారాజైన దావీదు నోట పలికినదైన వచనం చదవండి.

నా ప్రాణమా యెహోవాను సన్నుతించుము. ఆయన చేసిన 'ఉపకారములలో' దేనిని 'మరువకుము' ★

2



ఆత్మ విశ్వాసం కలిగినవాడు అదృష్టంమీద ఆధారపడడు.
**- డా.గరికపాటి నరసింహారావు**



బోధకులెవరైనా సరే, తాము చెప్పింది చేసే వారుగా ఉండాలి.
**-గుళ్లపల్లి మోజెస్ చౌదరి**
హైద్రాబాద్.



తెలివైన వాడిని బలంతో కొట్టాలి. బలమైన వాడిని తెలివితో కొట్టాలి.
**- ప్రభాస్**
మిస్టర్ ఫర్‌ఫెక్ట్ చిత్రంలో

ఆంధ్రప్రదేశ్ | NORTH EAST WEST SOUTH | తెలంగాణ



## మోదీ... సంవత్సరం!

ప్రధాని నరేంద్రమోదీ పీఠమెక్కి సంవత్సరమైంది. ఎటువంటి స్కాంలు లేకుండా ఓ సంవత్సరం గట్టెక్కుట ప్రస్తుత తరుణంలో చెప్పుకోదగిందే అంటున్న వారెందరో. ఇలా మరో నాలుగేండ్లపాటు ఆయన పాలన దేశాన్ని అభివృద్ధి పథంలో నడపాలని, అందుకోసం మనం ప్రార్థించాలన్నది రెండు రాష్ట్రాల్లోనున్న అనేక క్రైస్తవుల కోరిక. మన దేశాభివృద్ధికోసం ప్రార్థించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

మరణము వరకు నమ్మకంగా ఉంటూ.. పరుగు తుదముట్టించుకున్న

## రెవ.డా.ఈలి మెషెక్ జార్జిరాజు (4 & 5 ల్లో)

రెవ.డా.ఈలి మెషెక్ జార్జిరాజుగారు మా మావయ్య అవుట మాకెంతో దీవెనకరం. ఆయన ప్రభువునందు నిద్రించి ఐదేండ్లు గడిచిన సందర్భాన ఆయన సేవా పరిచర్యల్లో కొన్నింటినైనా తెలుసుకోవాలని ఆసక్తి కనబరచిన వారిని బట్టి దేవునికి స్తోత్రములు చెల్లిస్తూ వాటిని తెలుపుతున్నాం.



కుమార్తెలు షారోన్ కీర్తన, షెర్లీ జియోన్‌లతో రెవ.డా.జాన్ సుధాకర్, మెర్సి జాన్ దంపతులు.



☐ రాజధానికి ముహూర్తం కుదిరింది!
☐ అక్టోబరులో నిర్మాణ కార్యక్రమాలు షురూ!
☐ 'మహానాడు'లో.. తెలుగుదేశం పార్టీ 'జాతీయ పార్టీ'గా ఆవిర్భావం
☐ ఎన్‌టిఆర్‌కు నివాళులర్పించిన కుటుంబీకులు



మనుమడు క్రిష్‌రాజ్‌పాల్‌తో ఎడిటర్ కుటుంబం. (ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం)

'క్రైస్తవనాడు' పేపరును ప్రేమిస్తూ మాకు వివాహ దినోత్సవ శుభాకాంక్షలు చెప్పిన అందరికీ మా కుటుంబం తరపున కృతజ్ఞతలు తెలుపుతున్నాం.
- బ్రదర్ వై.కనకరాజు కుటుంబం.



☐ తెలంగాణ అంతటా 'మిషన్ కాకతీయ'
☐ చెరువుల పునరుద్ధరణ
☐ హుస్సేన్ సాగర్ ప్రక్షాళన
☐ బస్తీవాసులకు డబుల్ బెడ్‌రూం ఫ్లాట్లు

ముమ్మరంగా 'స్వచ్ఛ హైద్రాబాద్'. కార్యక్రమంలో మంత్రులు ఎంఎల్‌ఎలు



**పిరికితనము**
- డా.జాయ్ చెరియన్
ఫౌండర్ : యుపిఎఫ్
రాం నగర్, హైద్రాబాద్.

7



శ్రీమతి వివేకవతి.జో. రచన...
**సర్వేశ్వరుడు, నిజదేవుడు యెహోవాయే!** (వచ్చే 'క్రైస్తవనాడు'లో)

### విజయవాడలో రావెల ముఖ్య అతిథిగా

## 'స్కీమ్స్ అండ్ ఇన్సెంటివ్ ఫర్ ది డెవలప్‌మెంట్ ఆఫ్ క్రిస్టియన్ కమ్యూనిటీ'




మే 13, విజయవాడ : స్థానిక సి.యస్.ఐ. కాంప్లెక్స్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మంత్రివర్యులు రావెల కిషోర్‌బాబు ముఖ్య అతిథిగా క్రైస్తవుల అభివృద్ధికి దోహదపడేందుకు ఏంచేస్తే బాగుంటుందన్న దానిపై సభను నిర్వహించారు. క్రైస్తవ నాయకులు, పాస్టర్లు, విశ్వాసులు పాల్గొన్న ఈ సభలో వక్తలు తమ అభిప్రాయాలను తెలిపారు. తగు విధంగా తమ ప్రభుత్వం సహకరిస్తుందన్న భరోసాను మంత్రి రావెల కిషోర్‌బాబు ఇచ్చారు.

**- ప్రత్యేక ప్రతినిధి మట్టా ప్రభాత్‌కుమార్.**

## అనిల్ నిరీక్షణల పెండ్లి మహోత్సవం!



నూతన వధూవరులు అనిల్, నిరీక్షణలు



రెవ.విజయరాజు

20 మే, విశాఖ : పాస్టర్ విజయరాజు దంపతుల కుమారుని వివాహమహోత్సవం ఆరిలోవలో జరిగింది. కుటుంబీకులు, కాపర్లు, విశ్వాసులు అందరు పాల్గొని పెండ్లి కుమారుడు అనిల్‌ను పెండ్లి కుమార్తె నిరీక్షణను ఆశీర్వదించారు. వారి కొరకు ప్రార్థించారు.

సహోదరులు ఐక్యత కలిగి నివసించుట ఎంత మేలు ఎంత మనోహరము ★

## కుయుక్తులతో క్రైస్తవులను భ్రమపరుస్తున్న బ్రదర్ షఫి



క్రైస్తవులను తన వాగ్ధాటితో భ్రమపరుస్తూ గలిబిలికి గురిచేస్తున్న బ్రదర్ షఫి వివరణలు, ప్రశ్నలకు ఆయనిచ్చే జవాబులు తప్పు అని నిర్ద్వంద్వంగా నిరూపించనున్నాం. 'జ్ఞానులను వారి కుయుక్తిలో ఆయన పట్టుకొనును' అన్న బైబిలు మాటను బట్టి ఆయన జ్ఞానంలో గల కుయుక్తిని లోకానికి మరోసారి తేటతెల్లం చేయనున్న బ్రదర్ వైకెయార్.

**చదవండి! అనేకులచే చదివించండి!! దుర్బోధకుల ఆట కట్టించండి!!! - రెండు తెలుగు రాష్ట్రాల వాక్యాభిమానులు**




(మొదటిపేజీ తరువాయి) పై దేవుని మాటలో దేవుడు మననుండి కోరుకున్నదేమిటో కొంత తెలుస్తుంది. **నా అంతరంగమునున్న సమస్తమా ఆయన పరిశుద్ధ నామమును సన్నుతించుము. ★**

మరికొంత ఈ వాక్యంలో తెలుస్తుంది. మన అంతరంగంలో ఏముంటుంది? అంతరంగంలోనే తోటి వారిని ప్రేమించాలనే సత్సంకల్పాలే గాక రకరకాల ఆలోచనలు, ఆవేదనలు, అక్రమాలు, అమానుషాలు, మొదలగునవి పుడతాయి. అందు వల్ల దేవుడు మనల్ని మన అంతరంగాలలో ఉన్నవాటితో సహా గమనిస్తుంటారన్నది గుర్తుంచు కోవాలి. అంతరంగంలో చెడుంటే దేవుడు పరిశుద్ధుడు గనుక మనయందున్న చెడును తొలగించి ఆ చోట ఆయన తన పరిశుద్ధతను నింపును. మంచి ఉంటే ఆ మంచిని అనేకులకు మేలుకరంగా విస్తరింపజేయును. అందుకోసమే దేవుడు తన ప్రియకుమారునిగా ప్రభువైన యేసుక్రీస్తును ఈ లోకానికి పంపినట్లు బైబిలు సాక్ష్యమిస్తుంది.

**సత్యవంతుడైన వానిని (దేవునిని) ఎరుగవలెనని దేవుని కుమారుడు (యేసుక్రీస్తు) వచ్చి మనకు వివేకమును గ్రహించియున్నాడని యెరుగుదుము. ★**

ప్రభువైన యేసుక్రీస్తు జీవించు కాలంలో దేవుని ఉన్నతత్వాన్ని, మహోపకారత్వాన్ని లోకానికి తెలియజేసినట్లు బైబిలునందు మనమనేక చోట్ల చూస్తాం. ఈ శరీరము నిష్ప్రయోజనమని ఆత్మయే మనలను జీవింపచేస్తుందని చెప్పినమాట ఆనాటినుండి నేటిదినాల వరకు ఆశ్చర్యమే. కాదనుటకు, ఆ మాట తప్పనుటకును తగిన ఆధారం కనబడుట లేదన్నది నిర్వివాదం. ఎందుకంటే మనుషులు చనిపోతున్నారు. అప్పటివరకు అందరితో మాట్లాడినవారు అర్థంతరంగా తమ మాటలను ఆపివేస్తూ అచేతనంగా మారిపోవుట చూస్తుంటాం. దాన్నే మరణమంటాం. వారి రూపంగల శవం అక్కడే ఉం టుంది. కానీ అది మాట్లాడదు, కదలదు. ఎంత భద్రపరచిననూ తిరిగిలేవదు, పాడైపోతుంది. ఆ శవాన్ని మనమేమి చేసినా ఎందుకు నన్నిలా చేస్తున్నారని ప్రశ్నించదు. అందుక్కారణం మన ప్రభువైన యేసుక్రీస్తు పలికినట్లు ఆ శరీరాన్ని జీవింపజేసే 'ఆత్మ' ఇప్పుడందులో లేదు గనుక అదలా నిష్ప్రయోజనంగా ఉండిపోతుందని గ్రహించగలం. ఆత్మలేని శవంతో ఎవరికి ప్రయోజనం? కొన్ని ప్రయోగాలు చేయువారికి తప్ప. అందును బట్టి మనం జీవించి ఉండగానే, మనల్ని బట్టి లోకాన్ని ఎంతో ప్రేమించిన దేవుని మహోపకారాన్ని తలచి, ఘనపరచవలసినవారము. దేవుని ఎలా ఆరాధించాలనే సత్యాన్ని కూడా ఆత్మనుగూర్చి, శరీరాన్నిగూర్చి బయలుపరచిన ప్రభువైన యేసుక్రీస్తు మాటలలోనే చూద్దాం....

**దేవుడు (మనందరికి తండ్రి) ఆత్మ గనుక ఆయనను ఆరాధించు వారు ఆత్మతోను, సత్యముతోను, ఆరాధింపవలెననెను. తనను ఆరాధించువారు అట్టివారే కావలెనని తండ్రి కోరుచున్నాడు. ★**

మన శరీరాలను భూమిపై చలింపజేయు ఆత్మ మనయందుండగానే ఆత్మతోనూ, సత్యము (సత్యవంతుడైన దేవుని మాట) తోనూ దేవుని ఆరాధింపబద్దులమని ఎరగండి. ఎందుకనగా దేవుని వాక్యమైన బైబిలునందు మృతులును, మౌనస్థితిలోనికి దిగిపోవువారును యెహోవాను స్తుతింపరని వ్రాయబడింది! జాగ్రత్తపడదాం. ఒకవేళ పాతాళములో దిగిన తరువాత అవకాశముంటుందా అని అనుకొనుటకు అవకాశమే లేదుసుమా!

**పాతాళమున నీకు స్తుతి కలుగదు, మృతి నీకు కృతజ్ఞతాస్తుతి చెల్లింపదు. సమాధిలోనికి దిగువారు నీ సత్యము (వాక్యము)ను ఆశ్రయించరు. సజీవులే కదా నిన్ను స్తుతించుదురు. ఈ దినమున నేను సజీవుడనై నిన్ను స్తుతించుచున్నాను ★**

చదువబడిన దేవుని వాక్యం వలన మనకు తెలిసిందేమంటే ఈ లోకంలో జీవించియుండగానే దేవుని స్తుతింప బద్దులం. దేవుడు మనందరి యెడల చేసిన మహోపకారములనుబట్టి ఆయనను మహోపకారిగా మనం ఘనపరస్తూ, ఇతరులచే ఘనపరచేట్లు చేయాలి. అది క్రైస్తవుల లక్ష్యం కావాలి. మీరలా ఉన్నారా? లేకుంటే.. ఏమవుతుందో, ఏం పోగొట్టుకుంటారో ఎరగాలి.

**చేయుటకు నీ చేతికి వచ్చిన యే పనియైనను నీ శక్తిలోపము లేకుండా చేయుము. నీవు పోవు పాతాళమునందు పనియైనను, జ్ఞానమైనను లేదు. ★**

పై దేవుని మాటను కూడా త్రోసివేసి, పాతాళంలో బోధలుంటాయి, అక్కడ వినొచ్చు, బోధించొచ్చు అనుకొని మోసపోకండి. అలా అని మీకెవరైనా బోధిస్తే అది బైబిలుకు వ్యతిరేకమని గ్రహించుకోండి. ఇందు విషయమై మనకు ఆధారము గల మరియొక దేవునిమాట ప్రభువైన యేసుక్రీస్తు పలికినది చదివి గ్రహించండి.

**చేయుటకు నీవు (తండ్రియైన దేవుడు) నాకిచ్చిన పని నేను (యేస ుక్రీస్తు) సంపూర్ణముగా నెరవేర్చి "భూమిమీద" నిన్ను (తండ్రియైన దేవునిని) మహిమ పరిచితిని. ★**

పై మాటను బట్టి మానవులందరికి "మహోపకారి"యైన దేవునిని, ఆయన ప్రియకుమారుడైన యేసుక్రీస్తు (బైబిలు)ను మనం బ్రతికుండగానే మహిమపరచాలి. జాగ్రత్త సుమా!

క్రైస్తవనాడు పేపర్లో పతాక శీర్షికలుగా తొలినాళ్లనుంచి తండ్రియైన దేవుని, ప్రభువైన యేసుని అనేక పేర్లతో మహిమపరుస్తున్నప్పుడు మనలో కొందరిలా ఇతరుల గ్రంథాల, విశ్వాసాల జోలికి వెళ్లడంలేదు. తద్వారా అనవసర వివాదాలకు దూరంగా ఉంటున్నాం. ఇది సువార్త ప్రకటనలో 'క్రైస్తవనాడు' తొలినాళ్లనుంచీ చూపుతున్న మాదిరి. ఆ విధంగా అనేకులకు సువార్త ప్రకటిస్తున్నాం. ఇందుకు భిన్నంగా చాలామంది ఇతరుల గ్రంథాలు, విశ్వాసుల జోలికెళ్తూ వివాదాలకు కారణమౌతున్నారన్నది వింటున్నాం. ఇది లేఖన వ్యతిరేకమన్నది బైబిల్లో పట్టున్నవారిమాట. లోపల పేజీల్లో బైబిలుకు సంబంధించిన అనేక వివరణలు ఇస్తూ విశ్వాసులను కాపర్లను బలపరుస్తున్నాం. ఇది క్రైస్తవనాడు ఒరవడి. అందెట్టి సందేహాలు, ప్రశ్నలున్నా కార్యాలయానికి ఉత్తరం వ్రాయండి. మీరు వ్రాసిందాన్నిబట్టి మరింత వివరణ తదుపరి పేపర్లలో ఇస్తాం.
-ఎడిటర్

జన్మ లభించడం గొప్పేమీ కాదు. దాన్ని గుర్తించడం, కాపాడుకోవడం చాలా ప్రాముఖ్యమైన విషయం.

– చినజీయర్



**ప్రపంచంలో వాస్తవాలు మారవు. వాటిని చూచే విధానం, దాన్ని తెలిపే విధానాల్లో మార్పులుంటాయి. ఆ మార్పులు వారి వారి వ్యక్తిత్వ వికాసాల్ని బట్టి ఉంటాయి.**

# మగాడు



**పి.ఇమ్మానుయేలు,**
చీఫ్ మేనేజరు(రిటైర్డ్)
భారతీయ స్టేట్ బ్యాంక్, విశాఖ.

'ఏవండీ! మా నాన్నగారికి వంట్లో బాగోలేదట. ఫోన్ వచ్చింది'

'అయితే ఏమంటావు?'

'ఒకసారి వెళ్ళి చూసొస్తానండి. దగ్గరేకదా'

'ఇప్పుడా? ఇప్పుడు వీల్లేదు రేపట్నుంచి మా ఆఫీసులో వర్కు ఎక్కువగా ఉంటుంది! ఇంటికి ఆలస్యంగా కూడా వస్తాను. నువ్వెళ్ళిపోతే ఇంట్లో ఎలా గడుస్తుందనుకుంటున్నావు?

'ఒక్క రెండు రోజుల్లో వచ్చేస్తానండి'

'నువ్వు మరేం మాట్లాడకు. మీ నాన్నగారికి ఇప్పుడు వంట్లో బాగానే ఉండి ఉంటుంది. వద్దామనుకున్నాను గాని వీలులేకపోయింది అని ఒక ఫోన్ కొట్టు చాలు'.

'అదేమిటండి? కన్న తండ్రికి వంట్లో బాగోలేకపోయినా పంపించరా?'

'నీకు కన్న తండ్రే ముఖ్యమా? కట్టుకున్న మొగుడు ముఖ్యమా?' చెప్పు..

పెళ్లయ్యాక ఆడదానికి మొగుడి తర్వాతే ఎవరైనా? నువ్వెళ్ళిపోతే నా సంగతి ఎవరు చూస్తారు? అందులోనూ చలికాలం కూడాను!

'అవతల మా నాన్నగారికి వంట్లో బాగోలేకపోతే మీరిలా అంటే ఎలాగండి?'

ఎలాగంటే అలాగే! నువ్వు మాత్రం యిప్పుడు వెళ్ళడానికి అవదు! నేను పంపించను. పొద్దనగా ఆఫీసుకు వెళ్ళిపోయి చచ్చీ చెడి చాకిరీ చేసి సాయంత్రానికి ఇంటికొస్తే కాఫీయిచ్చే దిక్కుకూడా లేకుండా నేను ఇబ్బంది పడితే నీకు బాగుంటుందా? నీకు మనస్సు ఎలా ఒప్పుతుంది! నిన్నసలు దేనికి పెళ్ళి చేసుకున్నది?

'ఇంతకీ మీరనేది ఏమిటి? పంపించనంటారు? అంతేనా?

'అంతే'

'ఒకవేళ మీరు వద్దన్నా నేను వెళితే?'

'ఒకవేళ అలాంటిది జరిగితే నువ్వు అక్కడే ఉంటావు. మళ్ళీ ఇక్కడికి రానక్కర్లేదు. అంతో ఇంతో చదువు వెలగబెట్టావుకదా. నీకు మొగుడంటే లక్ష్యంలేదే.'

సునీత భర్తవైపు అదోలా చూసింది. ఆ చూపుకి సాల్మన్ ఉలిక్కి పడ్డాడు.

తర్వాత కొన్ని నెలలకు.......

సునీత ఇకా పుట్టింట్లోనే ఉంది. సాల్మన్ మాత్రం మాసిన గెడ్డంతో, లంఖణాలు చేసిన వాడిలా నీరసంగా అయిపోయి సునీతను తలుచుకుంటూ తన తప్పులు తెల్సుకోవడానికి ప్రయత్నిస్తున్నాడు. ఆఖరుకి వుండబట్టలేక సాల్మన్ సునీతను తీసుకురావడానికి బయల్దేరాడు. గుమ్మంలో నిలబడిన భర్తని చూసి పాపం సునీతగుండే కరిగి నీరైపోయింది. ఒక్క అంగలో అతని వద్దకు వెళ్ళింది. అంతలోనే తను పుట్టింటికి అతనికి చెప్పకుండా రావడానికి గల కారణం జ్ఞాపకం వచ్చి అతనికి దూరంలోనే ఆగిపోయింది.

'సునీతా'? సాల్మన్ కంఠం పేగిలింది.

పెళ్ళయినప్పటినుంచీ అంత సౌమ్యంగా అతనెప్పుడూ పిలువలేదు. అందకే ఆశ్చర్యంగా చూసింది.

'సునీతా!... నిన్ను నాతో తీసుకు వెళ్దామని వచ్చాను. నన్ను క్షమించు. మీ నాన్న గారికెలా ఉంది.' సాల్మన్ అలా అడిగే సరికి మొదట సునీత తెల్లబోయింది.

'ఎందుకు గొడవపెట్టు కోవడం అని బాగేనే ఉన్నారు' అంది.

'జరిగింది మర్చిపోదాం. నేనంత దురుసుగా ప్రవర్తించకపోవల్సింది. నువ్వు లేకపోతే నేనుండలేను సునీతా! పద వెళ్ళిపోదాం. సునీత సూటిగా అతని వైపు చూసి 'మర్చిపోదాం అని ఎంత తేలిగ్గా అనేశారండీ? మీరు అన్ని విధాలా మీ అవసరాలు తీర్చే బానిసగా చూసారే తప్ప, నాకూ ఒక మనసనేది ఉంటుందని, నేనూ మనిషినని ఎప్పుడైనా భావించారా? అసలు ఆలోచన ఎప్పుడైనా మీకు వచ్చిందా? పెళ్ళయిన తర్వాత ఆడదానికి తన భర్త, తన సంసారమూ ముఖ్యమే. కాదనలేదు. కాని, కుమార్తెగా నాకు తండ్రి కూడా ముఖ్యమేనండి. ఇన్నేళ్ళు పెంచి పెద్దచేసి మిమ్మల్ని ప్రయోజకుడిగా తీర్చిదిద్దిన మీ తల్లిదండ్రులు మీకు మాత్రం ముఖ్యం కాదా? మీ నాన్న గారికి వంట్లో బాగోలేదని తెలిస్తే మీరు వెళ్ళరా? ఆడది అంతేనండి! 'మా నాన్నకి వంట్లో బాగోలేదు. రెండ్రోజుల్లో చూసి వచ్చేస్తానంటే ససేమిరా పంపనన్నారు మీరు. ఒకవేళ నేను గడపదాటినా మళ్ళి రానవసరం లేదన్నారు. అంత వరకు ఎంతో సహనంతో మీరు ఏమన్నా అణిగి మణిగి ఉన్నాను. నా పెళ్ళి మీరు కోరిన ప్రకారం ఘనంగా చేసి అప్పులపాలైన మా నాన్నగారికి ఈ వయస్సులో జబ్బుచేస్తే సేవచేయడానికి కాదు కదా కనీసం చూసి రావడానికైనా వప్పుకోని మీ కసాయి మనస్తత్వం నేను భరించలేకపోయాను. ఆడదానికి సహనం సహజగుణం. సహనం చచ్చినప్పుడు. ఆడది శక్తిస్వరూపిణిగా మారుతుంది. ఆడది అబల అనుకోవడం పొరపాటు. ఆరోజు నేను వెంటనే బయల్దేరి రాబట్టే నా తండ్రిని నేను దక్కించుకోగలిగాను. ఆమె మాటల్లో ఎంతో ఆత్మ విశ్వాసం ఉంది. సాల్మన్ సిగ్గుతో తలవంచుకున్నాడు.

సునీతా! మనుషులు దూరమైనప్పుడే మమతలు పెరుగుతాయంటారు! నీ ఎడబాటులోనే నీ విలువనాకు తెలిసింది. నేనెంత మూర్ఖంగా ప్రవర్తించానో తెలిసి సిగ్గు పడ్డాను. నన్ను క్షమించు అన్నాడు సాల్మన్. సునీత నమ్మలేనట్లుగా చూసింది. అవును సునీతా ఇంకెప్పుడూ ఇలా మూర్ఖంగా ప్రవర్తించను. నిజాయితీ అతని కళ్ళల్లోని నిర్మలత్వం ఆమెకి అతనిపై నమ్మకాన్ని కలిగించాయి.

**'పురుషులుకూడ తమ సొంతశరీరములవలె తమ భార్యలను ప్రేమింపబద్ధులైయున్నారు. తన భార్యను ప్రేమించువాడు తన్ను ప్రేమించు కొనుచున్నాడు. తన శరీరమును ద్వేషించినవాడెవడునూ లేడుగాని ప్రతి వాడును దానిని పోషించి సంరక్షించుకొనును.'**

– ఎఫెసీ 5:28-30

క్రైస్తవనాడు
ఆధ్యాత్మిక, సామాజిక వార్తా పక్షపత్రిక



# ఆధ్యాత్మికం మేలు చేస్తుంది

ఆధ్యాత్మికాన్ని వెక్కిరించే తరం నేడు అన్ని చోట్లా కనబడుతోంది. టెక్నాలజీలో వెలిగిపోతున్నామనుకునే కొందరు ఆధ్యాత్మికాన్ని చిన్నచూపు చూస్తూ.. చులకనగాను మాట్లాడుతున్నారు. ఆధ్యాత్మికం ముసుగులో అన్ని మతాల్లోను అరాచకాలు జరుగుటే అందుక్కారణంగా భావించొచ్చు. ఏదేమైనా ఆధ్యాత్మికమన్నది లోకానికి మేలే చేస్తుంది గాని కీడు మాత్రం చేయదు. అదెప్పుడంటే – ఆధ్యాత్మికంగానే బ్రతుకుతు దేవుని గురించి తెలిపేవారి జీవన విధానంలో దైవత్వం అగుపడినప్పుడు. అలా కనబడాలంటే – ఆ యా బోధకులు దురాశాపరులై ఉండరాదు. తమ సామ్రాజ్య విస్తరణల కోసం భక్తుల సొమ్మును ఖర్చు చేయ మనసొప్పనివారై ఉండాలి. పక్షపాతం ఏకోశానా కనబర్చనివారై ఉండాలి. ప్రజా శ్రేయస్సుకై నాయకులకే సలహాలిస్తూ వారిని సక్రమ మార్గాన నడపాలి. అలా వారిని నడపాలంటే వీరి జీవితాల్లో అక్రమాలకు తావివ్వనివారై ఉండాలి. విలాసాలు అంటే ఏంటో ఎరుగని వారిగా బ్రతుకు సాగించాలి. ఎవర్ని పడితే వారిని అడుక్కొనే వారిగాను ఉండరాదు. ఇలా ఎన్నో విధాలుగా వారు మంచి సాక్ష్యంగలవారిగా జీవించాలి. అలాంటివారి జీవితాలే తమ బ్రతుకులో ఇతరులకు దైవత్వాన్ని కనబర్చగలవు. ఇవన్నీ మీకు తెలిసినవే కావచ్చు, తెలియనివీ కావచ్చు! ఆధ్యాత్మికాన్ని బోధించే వ్యక్తికే ఇట్టి అనేకమైన అర్హతలు ఉండాలంటే మరి మనం పూజించే దేవుడెట్టివాడై ఉండాలోనన్నది ఆలోచిస్తారనే అనేకుల చర్చల్లోగల సారాన్ని మీకిలా తెలపా!

"ప్రభువు వాక్యము శీఘ్రముగా వ్యాపించి మహిమ పరచబడు నిమిత్తము..... మా కొరకు ప్రార్థించుడి" ★

ఎడిటర్ కుటుంబీకులు వ్రాస్తున్న వివరణలన్నీ అప్పటికి తగినంతమాత్రమే. సంచలనాత్మక విషయాలు, త్వరలో అని ప్రకటించినవి వీలును బట్టి ప్రచురిస్తాం. కాబట్టి రాబోవు సంచికలను మిస్ కాకండి.

వివేకియైనవాడు తన విద్యను దాచి పెట్టును' అన్న బైబిలు వాక్యాన్ని బట్టి వైకె.రాజు, రవిరాజుల రచనల్లోగల వాక్యాలకు ★ గుర్తు ఇవ్వడమైంది.

'క్రైస్తవనాడు' విస్తరించేందుకు చందాలు పంపి సహకరించండి. మీ అనుదిన కుటుంబ ప్రార్థనల్లో గుర్తుచేసుకొండి. మీ స్నేహితులకు పరిచయం చేసి ప్రోత్సహించండి. మీ పరిచర్యా వివరాలు తెలిపి ప్రచురింపజేసుకోండి.

# దేవుని జ్ఞానం – మానవ విజ్ఞానం



బ్రదర్ వై.లీలా రవిరాజు

బైబిల్ / దేవుని మాట × సైన్స్ శాస్త్రజ్ఞుల / మాట

నీవు భూమిని స్థాపించితివి అది స్థిరముగానున్నది సమస్తము నీకు (దేవునికి) సేవ చేయుచున్నవి.

దేవుడు తన పనిని చేయడానికి కొంతమంది సేవకులను ఏర్పరచుకుంటారు. వారిద్వారా మిగిలిన జనాంగాన్ని మార్పు చెందించుటకు సాధనంగా వాడుకొనుట మనం బైబిలు ప్రారంభం నుండి చూస్తున్నాం. మారని వారికి నాశనం, మారినవారికి రక్షణ దేవుడు కలిగిస్తున్నారు. కొంతమంది సేవకులను దేవుని నమ్మినవారు చంపటం, హేళన చేయటం, తిట్టడం వంటివి చేసినప్పుడు దేవుడు వారిని అక్కడికక్కడే నాశనం చేసినట్లు చూస్తాం. ఉదాహరణకు 'దాతాను విషయం'

... యెహోవాకు ప్రతిష్ఠితుడైన అహరోనునందును అసూయపడిరి భూమి నెరవిడిచి దాతానును మ్రింగెను.

అసూయపడినందుకు దేవుడు దాతానును వారితో ఉన్నవారిని చూపించారు. అది కూడా భూమిద్వారా నాశనం చేయించారు. అసూయపడిన వారికి శిక్ష ఒకవిధమైనదైతే దేవునిమీద తిరుగుబాటు చేయువారికి, దేవునియందు ఉన్నవారిని బాధించినవారికి, దేవుని మాటలు చెప్పనివారికి, సణుగుకొన్న వారికి రకరకాల శిక్షలను దేవుడు ప్రకృతి ద్వారా చేయిస్తున్నారు. అవేంటో లేఖనాలద్వారా చూస్తే....

**దేవుని మీద తిరుగుబాటు చేసినవారు :**

**ఆకాశమా, ఆలకించుము, భూమీ చెవియొగ్గుము నేను పిల్లలను పెంచి గొప్పవారినిగా చేసితిని వారు నామీద తిరగబడియున్నారు.**

ఇశ్రాయేలీయులను గూర్చి మాటలాడుతూ దేవుడు చెప్పుకోవటానికి ఎవరు లేక ఆకాశముతో, భూమితో చెప్తున్నారు. పిల్లలను పెంచి గొప్పవారిగా చేసానని అంటే వారిని ఎంత జాగ్రత్తగా దేవుడు పెంచారు ఆయన మాటలలోనే అర్థమవుతుంది. గొప్పగా పెంచినందుకు వారు దేవునికిచ్చిన ప్రతిఫలం ఏమిటంటే తిరుగబడ్డారని దేవుడు చెప్తున్నారు.

ప్రతీకారం చేయక నేను మౌనంగా నుండను.

అని పలికిన దేవుడు వారికి ఎలాంటి శిక్ష విధించారో చూడండి.

ప్రతివాడు నడినెత్తిన వ్యాధిగలిగియున్నాడు. ప్రతివాని గుండె బలహీనమయ్యెను అరకాలు మొదలుకొని తలవరకు స్వస్థత కొంచెమైనను లేదు. ఎక్కడ చూచినను గాయములు దెబ్బలు పచ్చిపుండ్లు అవి పిండబడలేదు. కట్టబడలేదు, తైలముతో మెత్తన చేయబడలేదు. మీ దేశము పాడైపోయెను. మీ పట్టణములు అగ్నిచేత కాలిపోయెను, మీ యెదుటనే అన్యులు మీ భూమిని తినివేయుచున్నారు.

**దేవునియందు ఉన్నవారిని బాధించినవారు :**

**బాధించువారి సమూహము ఎగిరిపోవు పొట్టువలెనుండును. హఠాత్తుగా ఒక్క నిముషములోనే ఇది సంభవించును. ఉరుములతోను సుడిగాలి తుఫానులతోను దహించు అగ్నిజ్వాలలతోను సైన్యములకధిపతియగు యెహోవా దాని శిక్షించును.**

# అందరి దేవుళ్లు ఒక్కటే?!



"ఈ మధ్యకాలంలో అందరి దేవుళ్లు ఒక్కటే అనే కాన్సెప్ట్ వచ్చింది. అది తప్పు. మంగళ సూత్రము ఇతర బంగారు ఆభరణాలు ఒక్కటేనా? ఒకలాగే చూడగలమా? అలాగే దేవుళ్ల విషయంలో కూడాను" అని ఓ టివి కార్యక్రమంలో అనేక ప్రశ్నలకు జవాబులిస్తున్న సందర్భంలో.. డా.టి.కె.వి.రాఘవన్ ఇలా ప్రశ్నించారు!

ఇది చాలా మంచి ప్రశ్న! అందరి దేవుళ్లు ఒక్కటే కానప్పుడు దేవుడెవరు? అన్న మరో ప్రశ్న ఉత్పన్నంగాక మానదు. దేవుడొక్కడే అన్నది మాత్రం ఎక్కువగా వింటుంటాం. ఆ దేవుడెవరో అన్నది మాత్రం సుస్పష్టంగా తెలిపేందుకు ఎందరు సాహసిస్తున్నారన్నది మరో ప్రశ్న! అటువంటి పెద్దలు ఈ విషయంపై ఓ వివరణ ఇస్తే మంచిదన్నది ఆయన చెప్పిందాన్ని విన్న అనేక క్రైస్తవుల కోరిక.

క్రైస్తవనాడు డిటిపి, పేజ్‌మేకింగ్ & డిజైనింగ్ : జె.సి. డిజైన్స్ , మెదక్ & విశాఖ.

సం॥ చందా ₹ 200. చందాదారులకు పెళ్లి, పుట్టినరోజు, స్మారక ప్రకటనలు **ఉచితం!**
చందాదారులకు మాత్రమే రెగ్యులర్‌గా పంపబడుతుంది. పత్రిక అందని చందాదారులు ఉత్తరాల ద్వారా మాత్రమే ఆ సంగతి మాకు తెలియజేయాలి. లేకుంటే మేం బాధ్యత వహించలేం. చందాలు, ప్రకటనలకు సంబంధించిన సొమ్ముకు తగు రసీదు వెంటనే తీసుకొని 9346960601 / 8885362270 నంబర్లకు ఫోన్ చేయండి.

మీ రచనలు, వ్యాసాలు, ప్రసంగాలు, కవితలు, పద్యాలు, ఏవైనా సరే మేము ప్రచురించాలంటే భారతదేశ సార్వభౌమత్వానికి, భారత రాజ్యాంగానికి భిన్నంగా ఉండరాదు. లోకోక్తులు, టిప్స్, జనరల్ స్టడీ బిట్స్ సేకరణలు, అలాగే మునుపటి సంచికల్లో గల కొన్ని శీర్షికలు అనేక మంది పాఠకుల కోరికపై మరలా వీలును బట్టి ఇస్తున్నాం. అందువల్ల కొన్ని రిపీట్ అవుతున్నాయి. ముందు జరిగినదే ఇప్పుడును జరుగును; జరుగవోవునది పూర్వమందు జరిగినదే; జరిగిపోయినదానిని దేవుడు మరలా రప్పించును. ★

'క్రైస్తవనాడు'లో ప్రచురించబడే ఇతరుల రచనలు ఆయా రచయిత / రచయిత్రిల వ్యక్తిగత అభిప్రాయాలు మాత్రమే, పత్రిక పాలసీకి ఎటువంటి సంబంధం లేదు. అడ్వర్టైజ్ మెంట్స్‌పై స్పందించే ముందు క్షుణ్ణంగా విచారించుకోండి. ఈ పత్రికకు ఏ విధమైన సంబంధంలేదు.

Online A/C : CHRISTAVANAADU, Current A/C : 13 96 111 00 00 00 52
Andhra Bank, Adarsha Nagar Branch, Visakhapatnam - 530 040
IFSC Code : ANDB0001396

**ఎందుకు?! :**

'క్రైస్తవనాడు'లో హైందవ పండితులు, ఇతరులు, సినిమావాళ్లుచెప్పేవి మరియు రాజకీయాలను గురించి ప్రచురించుటెందుకన్నది 'మనలో' అనేకుల సందేహం! బైబిలు దేవుని గ్రంథమంటూ బోధిస్తూ ఇతరులను, సినిమావాళ్లను చులకనజేసి మాట్లాడే ప్రబుద్ధులెందరో 'మనలో' ఉన్నారు. క్రైస్తవేతరుల మాటలు, చేతలే అంతలా ఆలోచింపజేస్తుంటే.. జీవంగల దేవుని మాటలు మరెంతలా ఆలోచింపజేయాలి! 'మనలో' ఎందరి మాటలు, చేతలు లోకాన్ని ఆలోచింపజేసి ప్రభావితం చేయగలుగుతున్నాయోనన్నది తెలిపేందుకే 'క్రైస్తవనాడు'లో అవి ప్రచురిస్తున్నాం. ఇక రాజకీయాలను గురించి... ఆ యా కాలాల్లో జరిగిన సమకాలీన రాజకీయాలు. సంగతులను అనేకం బైబిల్లో దేవుడు వ్రాయించారు. 'నర'లోక సంగతులనే అవగాహన చేసుకోలేనివారు 'పర'లోక సంగతులను ఎలా గ్రహించగలరు? అందుకే 'నర'లోక రాజకీయ సంగతులు 'క్రైస్తవనాడు'లో చోటుచేసుకుంటున్నాయి. తొలి నుంచీ 'క్రైస్తవనాడు'ది అదే ఒరవడి. అందుకు బైబిలే మాకు మాదిరి. అందుకే 'క్రైస్తవనాడు'కు అంత ఘనత! అందుకు 'దేవునికి స్తోత్రము'.

**TELANGANA :** CHRISTAVANAADU
C/o A.Prem Kumar, 1-5-89/6,
CSI Mission Compound,
Sadasivpet, Medak Dist - 502 291
Call : 8885362270

**ANDHRA PRADESH :** CHRISTAVANAADU, 18-441/5
Laxmi Swathi Residency, 204, Santha Palem, China Gadili,
Old dairy farm (Po), Visakhapatnam - 530 040.
A.P., INDIA . Call : 9346960601 / 9490266640

christavanaadu@gmail.com & christavanaadu1@yahoo.co.in

## మరణము వరకు నమ్మకంగా ఉంటూ.. పరుగు తుదముట్టించుకున్న

# రెవ.డా.ఈలి మెషెక్ జార్జిరాజు

- యెరూషలేము ప్రేమికుడు .
- విశాఖ క్రైస్తవానికో నావికుడు .
- ఆత్మల భారంతో సేవలో పరుగులెట్టినా.. అలుపెరుగని ప్రయాణికుడు .
- యథార్థవంతుడు.. నిరాడంబర జీవి
- ఎందరో క్రైస్తవనాయకులకు, కాపర్లకు దిశానిర్దేశం చేసినవారు
- సంఘ కాపర్లైనా, నాయకులైనా వాక్యంలో తొట్రిల్లితే.. సరిచేసేందుకు వెనుకాడని ధీశాలి .

**'యేసుతో ఒకరోజు'** ఈ పేరుతో సెలవు దినాల్లో పబ్లిక్ ప్లేసుల్లో సువార్త కూడికలెన్నో చేసారు రెవ.డా.ఈ.ఎం.జార్జిరాజు.

**'ఫోర్త్‌మెన్ గాస్పల్ అసోసియేషన్'** ను బిషప్ ఎం.ఎ.పాల్, రెవ.నక్కా కృపారావు, మరియు దైవజ్ఞానంలతో కలిసి స్థాపించారు. తద్వారా ఎన్నో ప్రార్థనా కూటములను జరిగించారు.

రెవ.డా.ఈలి జార్జిరాజు పరుగెడుతూ చేసిన సేవలో విశాఖ, రంగారెడ్డి, హైద్రాబాద్, వైయస్సార్, కృష్ణా, గుంటూరు, తూర్పు, పశ్చిమ గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలు ఉన్నాయి. గ్రేటర్ ముంబై, ఒడిశా, మణిపూర్, మేఘాలయ, జార్ఖండ్, నాగాలాండ్, సిక్కిం, అరుణాచల్ ప్రదేశ్ తదితర రాష్ట్రాలున్నాయి. ఇవేగాక ప్రపంచంలో తాను ఎంతగానో ప్రేమించిన యెరూషలేముకు, సింగపూర్, అమెరికా దేశాలకూ వెళ్లారు. అలా పరుగెడుతు తుదకు విశాఖలో సేవలోనే తన పరుగు తుదముట్టించుకుని ప్రభువు చెంతకేగిన ధన్యజీవి. ఇంకా.. ఇంకా.. ఇంకెన్నో రకాలుగా విశాఖ క్రైస్తవులచే సాక్ష్యం పొందిన క్రీస్తు సాక్షి.. అనేక క్రైస్తవుల ప్రేమాభిమానాలను చూరగొన్న రెవ.డా.ఈలి మెషెక్ జార్జిరాజు ప్రభువునందు నిద్రించి అప్పుడే ఐదేండ్లు గడిచాయి! అయినా అనేకులకు నిన్నవలె ఉంది. ఈ సందర్భాన ఆయన చేసిన సేవ గురించి అనేకుల అభిప్రాయాలను ఇక్కడ మీకందిస్తున్నాం. ఆయన విడిచి వెళ్ళిన సేవకోసం, దాన్ని కొనసాగిస్తున్న వారి కుటుంబాల కోసం ప్రార్థించాలన్నది విశాఖలో అనేక విశ్వాసుల కోరికయైయున్నది.

వి

తన తోటి ఉద్యోగస్తులను స్నేహితులను ఐక్యపరుస్తూ సువార్తలు జరిపేవారు. అలా ఏర్పడిన వారిలో ఆయనతో కలసి దేవుని జతపనివారుగా ఉన్న వారెందరో నేడు విశాఖలో బలమైన సేవకులుగా ఉన్నారు.

సంపూర్ణంగా సేవకు సమర్పించుకొనుటకై మరో సంవత్సరంపైగా చేసుంటే వచ్చే 'బెనిఫిట్'లను సహితం వద్దనుకొని రాజీనామా చేసిన వైనం నాడే ఎంతో చర్చనీయాంశమైందని ఆయన్ని గురించి చెబుతుంటారు.



రెవ.డా.ఈ.ఎం.జార్జిరాజు, మేరి జార్జిరాజు దంపతులతో కుటుంబీకులు

పెద్దకుమార్తె రాజకుమారి, రెవ.బి.రత్నరాజు దంపతులు, టింకు, సుధారాణి దంపతులు, డాలీ మరియు ఫిన్ని

రెండవ కుమార్తె ఎస్తేరు ఫ్లోరెన్స్, విక్టర్ రాజు దంపతులు. మూడవ కుమార్తె మెర్సి, డా.జాన్ సుధాకర్ దంపతులు,షారోన్ కీర్తన, షెర్లీ జియోన్

### యెరూషలేము ప్రేమికుడు

రెవ.డా.జార్జిరాజు వివాహం జరిగింది మే 14న. అది 'ఇశ్రాయేలు' దేశ స్వాతంత్ర్య దినం. ఆయన ప్రతీయేటా మే 14న తమ సంఘంలో ఇశ్రాయేలు కొరకు ప్రార్థిస్తుంటారు. ఇప్పుడాయన లేకున్నా రెవ.డా.జాన్ సుధాకర్ దంపతులు దాన్ని కొనసాగిస్తున్నారు. అదేం విచిత్రమో లేక జార్జిరాజు ఇశ్రాయేలు యెడల చూపిన ప్రేమోగాని ప్రభువాయనకు ఓ మనుమరాల్ని అదే రోజున బహుమానంగా ఇచ్చారు. అంతేనా! మొన్నీమధ్యనే ఆయన మనుమడికి ఇద్దరు ఆడపిల్లల్ని అదే రోజున బహుమానంగా ఇచ్చారు. ఆయన బ్రతికుంటే ఇది విని ఇంకెంత సంతోషించేవారో. ఇశ్రాయేలుని ఆయన ప్రేమించారు.. దేవుడాయనకు అందుకు తగ్గ ఫలమిచ్చారంటూ సంఘస్తులు తమ సంతోషాన్ని వ్యక్త పరుస్తుంటారు.



DOB : 12-12-1938 DOD : 30-05-2010

**I have fight the good fight; I have finished the race; I have kept the faith** - Thimothy 4:7

Founder :
**HEBRON**
**HOUSE OFWORSHIP & MINISTRIES**
Mangapuram colony,
Visakhapatnam - 530 017.



రెవ.డా.ఈ.ఎం.జార్జిరాజు కన్నీటి ప్రార్థనాపరుడు. ఆయన వాక్య పరిచర్యలో గద్దింపు, అధికారం సుస్పష్టంగా కన్పడతాయి. వాక్యం చెప్పకముందే ప్రార్థనలో సంఘాన్ని సిద్ధపరుస్తూ కన్నీటి పర్యంతమైన సంఘటన నా జీవితాన్నే మార్చివేసింది.

బిషప్ ఎం.ఎ.పాల్, విశాఖపట్నం.



రెవ.డా.ఈ.ఎం.జార్జిరాజు విశాఖపట్నంలో ప్రార్థనాయోధుడు. ఏ కార్యక్రమమైనా ఆయన ప్రార్థన కన్వీనర్‌గా మొదలయ్యేవి. యథార్థవంతుడు, నిరాడంబర జీవి. వాక్యానుసార అనుభవం కలిగినవారు. ఆరాధన ఆత్మ కలిగినవారు. అనేక సంఘాలను స్థాపించినవారు. ఆఖరుక్షణం వరకు ప్రభువు కొరకు ప్రయాసపడిన వారు. యెరూషలేము కొరకు వాక్యానుసారంగా ప్రార్థించేవారు. యెరూషలేము వెళ్లి పరిచర్య చేసినవారు.

బిషప్ ఎం.మోహనరావు, విశాఖపట్నం.

### డాడీ అంటే ఒప్పేవారు కారు!

విశ్వాసులు ఎప్పుడైనా ఆయన్ని డాడీ అని పిలిస్తే ఒప్పేవారు కారు రెవ.డా.జార్జిరాజు. వారిని గద్దించి మత్తయి సువార్త 23 :8,9,10 వచనాలను చూపి సరిచేసేవారు.

### ప్రభువు కోరేది నిన్నే!

విశ్వాసలెవరైనా సంఘానికి రాకుండా దశమభాగం పంపితే తిరిగి పంపించేస్తూ వారితో ప్రభువు నీ ధనాన్ని కాదు నిన్నే కోరుతున్నారనేవారు.

వాక్యంలో చతురోక్తులకు తావిచ్చేవారు కారు రెవ.జార్జ్‌రాజు. అలా జరిగింద'ట' ఇలా జరిగింద'ట' అనే 'అట' బోధలను ఆయన ఖండించే వారు. బైబిల్లో 'అట'లు ఉండవు. అవునంటే అవును, కాదంటే కాదు అని మాత్రమే మనం బోధించాలనేవారు.

దేవుని నామాన్ని వ్యర్థంగా ఉచ్ఛరింప కూడదన్న వాక్యాన్ని పాటించి చూపారు. ప్రసంగాలలో కాని, మరెక్కడయినా గాని దేవుని నామాన్ని అనవసరంగా రెవ.జార్జిరాజు వాడలేదు. వాక్యంలో జోకులు చెప్పేవారే కారు.



రెవ.ఈ.ఎం.జార్జిరాజు అన్నయ్య సమానులు. మంచి సేవకులు. నశించిన ఆత్మల కొరకు రోషం కలిగిన ప్రార్థనాపరులు. దేవుని రాజ్యం స్థాపించాలని ఆయన త్వరగా వస్తున్నాడని ప్రతి సంఘానికి వెళ్లి ప్రకటించిన దైవజనులు మా ఈ.ఎం.జార్జిరాజు అన్నయ్య.

బిషప్ ఎం.జాన్‌పాల్, సబ్బవరం, విశాఖపట్నం.



రెవ.డా.ఈ.ఎం. జార్జిరాజు గొప్ప దైవజనుడు. ప్రార్థనాపరుడు. ఆత్మల రక్షణ విషయంలో భారం కలిగి అనేకమందిని ప్రభువు దగ్గరకు నడిపించిన వారు. డాంబికం కనబర్చక నిరాడంబరంగా జీవనం సాగించేవారు. సేవకొరకు పరుగులు పెట్టే వ్యక్తి. ఆ పరుగుతోనే ట్రైన్ ఎక్కిప్రభు సేవకు గాక ఏకంగా ప్రభువు చెంతకేగిన ధన్యజీవి. ఆయన నాకు చిన్నాన్న అవడం నాకెంతో భాగ్యం. విశాఖకు ఆయన సేవలెంతో దీవెనకరం.

రెవ.డా.సువార్త రాజు, సామర్లకోట.


ఆయన నేను కలసి చాలా సువార్త క్యాంప్‌ల్లో పాల్గొనేవారం. నన్ను మిషనరీ బ్రదర్ అని పిలిచేవారు. అస్సాం, నాగాలాండ్ తదితర రాష్ట్రాల్లో సేవ చేసాం. ఆంధ్రాయూనివర్శిటీలో మిటింగ్‌లు పెట్టి నన్ను బోధకులుగా పిలిచేవారు. సేవలో ఆయనెప్పుడు రన్నింగ్ మేన్ అని ముద్దుగా పిలిచేవాన్ని. ఆ పరుగులోనే ఆయన సేవను తుదముట్టించుకున్నారు

– రెవ.ప్రభుదాస్, పిఠాపురం.



ఎటువంటి సేవకులైన ఎంతటి వారైనా వాక్యాన్ని సరిగా బోధించకపోతే నిర్మొహమాటంగా ఖండించే ధీశాలి మా జార్జిరాజు. తొలి తరంలో సేవలో బలమైన వ్యక్తుల్ని కలుపుకుని పరిచర్య జరిగించారు. నన్ను ఎన్నో రకాలుగా ప్రోత్సాహపరచేవారు. నేడెందరో పెద్ద సేవకులనబడే వారు ఆయన స్కూలు ఎరిగినవారే. ఓ సారి విపత్కర పరిస్థితి ఎదురైతే నాకోసం ఇతర పెద్దల్ని సహితం ఎదిరించి నన్ను ఆదరించారు. న్యాయానికి అంత విలువిచ్చే వారాయన. నేడు మేము చేస్తున్న సేవను ఆయన చూసుంటే ఎంతగా సంతోషించేవారో వర్ణించలేను. అటువంటి దైవజనుని తలంచుకొనుట ఆశీర్వాదకరం.

రెవ.ఎం.ఆర్.జేమ్స్, విశాఖపట్నం.



నిష్కపటులైన దైవజనుడు రెవ.ఈ.యం.జార్జిరాజు. ఆయన అధ్యక్షులుగా నేను సెక్రటరీగా 1987లో 'ఇవాంజిలికల్ ఫెలోషిప్ ఆఫ్ విశాఖపట్నం'ను స్థాపించి ప్రార్థనలు జరిగించేవారము. ఒకసారి ప్రార్థనలో పాల్గొనేందుకు ఎవరూ రాలేదు. అప్పుడు నేను అన్నా ఎవరూ రాలేదు ఏం చేద్దాం అన్నాను. అందుకాయన ఇలా అన్నారు - ఏకీభవించని వందమంది చేసే ప్రార్థన కంటే ఇద్దరు లేక ముగ్గురు ఏకీభవించి చేసే ప్రార్థనే ప్రభువు పని జరిగిస్తుంది. అందువల్ల ఎవరూ రాకున్నా ఫర్వాలేదు. మనం చింతిచాల్సిన అవసరం లేదన్నారు. సేవలో నేను ఇప్పటికీ ఆ మాట ద్వారానే బలపరచబడుతుంటాను. అనేకులకు ఆ మాటను చెబుతుంటాను. సేవలో తనను విభేదించిన వారిని గురించి సహితం ఆయన ఏనాడూ చెడుగా మాట్లాడుట నేను వినలేదు. నేడు ఎందరో సేవకులకు అది మాదిరి.

రెవ.సుకుమార్ పట్నాయక్,విశాఖపట్నం.



రెవ.ఈ. రాయ్ థియోఫ్లస్

బ్రదర్ పి.జోషి (హైద్రాబాద్), రెవ.డా.వి.రంగరాజు (బెంగళూరు), రెవ.ఆర్.జాన్ ఇళంగోవన్ (చెన్నై) తదితరులెందరో పాల్గొని తమ తమ ప్రసంగాలందించారు.

# తండ్రికి ఇష్టమైన కార్యము



బిషప్.ఎం.ఎ.పాల్

"అయినను నా యిష్టము కాదు, నీ చిత్తమే సిద్ధించును గాక!" – యేసుక్రీస్తు

ఇహలోక ఆశలను తీర్చుకోవాలని తీవ్రమైన వాంఛకంటే ఆత్మ సంబంధమైన నిత్యత్వమును గూర్చిన హృదయవాంఛ దైవచిత్తమును నెరవేర్చును. అంతేకాక దేవుని సంఘమునకు క్షేమాభివృద్ధిని కలుగజేయును. కాబట్టి నీవు ఈ లోకంలో చేసే ప్రతివిధమైన కార్యం నిత్యత్వంలో ప్రతిధ్వనిస్తుంది. యేసుక్రీస్తు ప్రభువు దేవుని చిత్తమును నెరవేర్చుటకు మాత్రమే తన భౌతిక జీవితమును కొనసాగించి యున్నాడు. " నా దేవా, నీ చిత్తం నెరవేర్చుట నాకు సంతోషము" కీర్తనలు 40:8.

యేసు " ఆయన (తండ్రికి) ఇష్టమైన కార్యము నేనెల్లప్పుడును చేయుదును కనుక ఆయన నన్ను ఒంటరిగా విడిచిపెట్టలేదని" చెప్పెను. తండ్రి ఏమి మాట్లాడుచున్నాడో కుమారుడు కూడా అవే మాట్లాడియున్నాడు. తండ్రి ఏమి చేయుట చూచుచున్నాడో, కుమారుడు కూడా అదే చేసి యున్నాడు. యేసుక్రీస్తు ప్రభువు ఎల్లప్పుడూ తండ్రి సన్నిధికి వెళ్లి ప్రార్థన చేసి ఆయన హృదయమును, ఆయన ఆశయాలను, తెలుసుకొని కేవలం తండ్రి చిత్తప్రకారం చేయుటకే జీవించియున్నాడు. ఆహారం కంటే దేవుని చిత్తమే ప్రాముఖ్యమని యేసుక్రీస్తు ప్రభువు ఉద్ఘాటించియున్నాడు. యేసు వారిని (శిష్యులను) చూచి – "నన్ను పంపినవాని చిత్తమును నెరవేర్చుటకు ఆయన పని తుదముట్టించుటయు నాకు ఆహారమైయున్నది" అని యోహాను 4:34లో సెలవిచ్చియున్నాడు. యేసుక్రీస్తు ప్రభువును వెంట ఉండి వెంబడించుచున్న శిష్యులు ఆయనను గూర్చి దేవుని యింటిని గూర్చిన ఆసక్తి ఆయనను భక్షించుచున్నదని సాక్ష్యమిచ్చియున్నాడు. ఆయన శిష్యులు – నీ యింటిని గూర్చిన ఆసక్తి నన్ను భక్షించునని వ్రాయబడినట్లు జ్ఞాపకం చేసికొనిరి. యోహాను 2:17.

యేసుక్రీస్తు ప్రభువు ఆత్మ, ప్రాణ, శరీర విషయములలో ముమ్మాటికి తండ్రిని ప్రతిబింబించి యున్నాడు. నన్ను చూచిన వాడు తండ్రిని చూచియున్నాడు. తండ్రియందు నేనును, నాయందు తండ్రియు యున్నాము. తండ్రి నాయందు నివసించుచు తన క్రియలు చేయుచున్నాడు అని ఫిలిప్పుతో స్పష్టంగా, ధైర్యంగా చెప్పగలిగారు. నన్ను పంపినవాని చిత్తప్రకారము చేయగోరుదును గాని, నా యిష్టప్రకారము చేయగోరను. ఇది యేసుక్రీస్తు యొక్క సాక్ష్యము. ఆయన రక్షించిన బిడ్డలముగా మనము కూడా మన సొంత ఆశలు నెరవేర్చుటకు జీవించకూడదు. ప్రతి విషయములోను ప్రతి సందర్భములోను దేవుని చిత్తమును గ్రహించుకొని ఆ ప్రకారము జీవించబద్ధులమై యున్నాము. అపొస్తలుడైన పౌలు ఈ సత్యమును బాగుగా గ్రహించి, ఈ విధముగా తెలియజేసి యున్నాడు. "నేను చెప్పునదేమనగా ఆత్మానుసారముగా నడుచుకొనుడి, అప్పుడు మీరు శరీరేచ్ఛను నెరవేర్చరు. శరీరం ఆత్మకును, ఆత్మ శరీరమునకును విరోధముగా అపేక్షించును. ఇది యొకదానికొకటి వ్యతిరేకముగా ఉన్నవి గనుక మీరేవి చేయనిచ్ఛయింతురో వాటిని చేయకుందురు. మీరు ఆత్మచేత నడిపించబడిన యెడల ధర్మశాస్త్రమునకు లోనైన వారుకారు. శరీరకార్యములు స్పష్టమైయున్నవి. అవేవనగా జారత్వము, అపవిత్రత, కాముకత్వము, విగ్రహారాధన, వ్యభిచారం, ద్వేషములు, కలహము, మత్సరములు, క్రోధములు, కక్షలు, భేధములు, విమతములు, అసూయలు, మత్తతలు, అల్లరితో కూడిన ఆటపాటలు మొదలగునవి. వీటిని గూర్చి నేను మునుపు చెప్పిన ప్రకారము ఇట్టివాటిని చేయువారు దేవుని రాజ్యము స్వతంత్రించుకొనరని మీతో స్పష్టముగా చెప్పుచున్నాను" (గలతీ 5:16–21).

"క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని ఇచ్ఛలతోను, దురాశలతోను సిలువ వేసియున్నారు" (గలతీ 5:24).

అంతేగాక "శరీరేచ్ఛలను బట్టి విత్తువాడు తన శరీరమునుండి క్షయమను (నశించిపోయే) పంట కోయును. ఆత్మనుబట్టి విత్తువాడు ఆత్మనుండి నిత్యజీవమను పంట కోయును" అని గలతీ సంఘమునకు హెచ్చరిక చేయుచున్నాడు (గలతీ 6:8).

దేవుని చిత్తమును కేవలము ప్రార్థన ద్వారాను, పరిశుద్ధ దైవలేఖనములను క్రమపద్ధతిలో అనుదిన పఠనము చేయుటవలనను తెలిసికొనగలము. పరిశుద్ధాత్మ సహాయం లేనిదే మనము దేవుని హృదయవాంఛలను నెరవేర్చలేము. దావీదునుగూర్చి ప్రభువు – నేను యెష్షయి కుమారుడైన దావీదును కనుగొంటిని అతడు నా ఇష్టానుసారుడైన మనుష్యుడు, అతడు నా ఉద్దేశ్యములన్నియు నెరవేర్చునని సాక్ష్యమిచ్చినట్లు మనలను గూర్చి కూడా సాక్ష్యమియ్యగలడా? దినములు చెడ్డవి గనుక సమయమును పోనియ్యక సద్వినియోగము చేసికొనుచు, అజ్ఞానులవలె కాక, జ్ఞానులవలె నడుచుకొనునట్లు జాగ్రత్తగా చూచుకొనుడి. ఇందునిమిత్తము మీరు అవివేకులు కాక ప్రభువు యొక్క చిత్తము ఏమిటో గ్రహించుకొనుడి. ఆత్మపూర్ణులై యుండుడి. ఎల్లప్పుడు సంతోషముగా ఉండుడి. ఎడతెగక ప్రార్థన చేయుడి. ఈలాగు చేయుట యేసుక్రీస్తునందు మీ విషయములో దేవుని చిత్తము. మీరు పరిశుద్ధులగుటయే, అనగా మీరు జారత్వమునకు దూరముగా ఉండుటయే దేవుని చిత్తము. మీలో ప్రతివాడును, దేవుని ఎరుగని అన్యజనులవలె కామాభిలాషయందు కాక పరిశుద్ధతయందును, ఘనతయందును తనతన ఘటమును ఎట్లు కాపాడుకొనవలెనో అది ఎరిగియుండుటయే దేవుని చిత్తము. పరిశుద్ధులగుటకే దేవుడుమనలను పిలిచెను గాని, అపవిత్రులుగా ఉండుటకు పిలువలేదు. ఈ విషయములను ఉపేక్షించువాడు మనుష్యుని ఉపేక్షింపడు గాని మీకు తన పరిశుద్ధాత్మను అనుగ్రహించిన దేవునినే ఉపేక్షించుచున్నాడు. క్రీస్తు శరీరమునందు శ్రమపడెను గనుక మీరును అట్టిమనస్సును ఆయుధముగా ధరించుకొనుడి. శరీరవిషయములో శ్రమపడినవాడు శరీరమందు జీవించు మిగిలిన కాలమందు ఇకమీదట మనుజాశలను అనుసరించి నడుచుకొనక దేవునికి ఇష్టానుసారముగా నడచుకొనునట్లు పాపముతో జోలి ఇకనేమియు లేకయుండును. మనము పోకిరిచేష్టలు, దురాశలు, మద్యపానము, అల్లరితోకూడిన ఆటపాటలు, త్రాగుబోతుల విందులు, చేయదగని విగ్రహపూజలు (దేవునికియ్యవలసిన స్థానమును మనుష్యులకు గాని, డబ్బుకి గాని, వస్తువులకు గాని ఇచ్చుటయే ఆత్మసంబంధమైన విగ్రహారాధన) మొదలైనవాటియందు నడచుకొనుచు, అన్యజనుల ఇష్టం నెరవేర్చు చుండుటకు గతించిన కాలమే చాలును. మనలో యుద్ధములును పోరాటములును దేనినుండి కలుగుచున్నవి? మన అవయవములలో పోరాడు మన భోగేచ్ఛలనుండియే గదా! మనం మేలు ఆశించుచున్నాముగాని మనకు దొరకుటలేదు. మన భోగముల నిమిత్తము వినియోగించుటకై దురుద్దేశముతో దేవునిని ప్రార్థించినట్లయితే మనకేమియు దొరకదు. మనలో జారత్వమేగాని, ఏ విధమైన అపవిత్రతయేగాని, లోభత్వమేగాని (పిసినితనం) వీటిపేరైననూ ఎత్తకూడదు. ఇదే పరిశుద్ధులకు తగినది. కృతజ్ఞతవచనమే మనము పలుకవలెను గాని, బూతులైనను, పోకిరిమాటలైనను, సరసోక్తులైనను ఉచ్చరింపకూడదు. ఇవి మనకు తగదు. వ్యభిచారియైనను, అపవిత్రుడైనను, విగ్రహారాధికుడైనను, లోభియైనను, క్రీస్తుయొక్కయు, దేవునియొక్కయు రాజ్యమునకు హక్కుదారుడు కాడను సంగతి మనకు నిశ్చయముగా తెలుసు. మనము పరిశుద్ధాత్మకు ఆలయమై యున్నాము. మనము మన సొత్తుకాదు. విలువపెట్టి కొనబడిన వారము. గనుక మన ఆత్మ ప్రాణదేహములతో ఆయనను మహిమపరచ బద్ధులమైయున్నాము. కనుక ఈలోక ఆశలను నెరవేర్చుటలో శాపము, నష్టము, బాధ కలుగుటతప్ప మరియే ప్రయోజనము లేదు. మనము లోకమునకు, లోకమునకు మనము సిలువవేయబడాలి. ప్రతిదినము మనలను పరీక్షించుకొనుచు, మనుష్యులను సంతోషపెట్టువారు చేయునట్లు కంటికి కనబడుటకై కాక, క్రీస్తుదాసులమని ఎరిగి దేవుని చిత్తమును మన:పూర్వకముగా జరిగించుచు మనుష్యులకు చేసినట్లుకాక, ప్రభువునకు చేసినట్లే ఇష్టపూర్వకముగా సేవ చేయాలి. వాక్యము చెప్పినట్లు అన్నియు చేయదగినవి కావు అన్న సత్యమును మాటిమాటికి జ్ఞాపకము చేసికోవాలి. అప్పుడు మేలు కలుగుటకై సమస్తము సమకూడి జరుగును. యేసుప్రభువువలె నా ఇష్టము కాదు. నీ చిత్తమే సిద్ధించును గాక అని చెప్పగలవారమై యుండవలెను.

## టి వి బోధకుల్లారా..!

విశ్వాసుల్ని కనీసం ప్రార్థనైనా చేసుకోనివ్వరా?! మీకు చెబితే అదీ మీరే చేసేస్తారా? వారి గొంతును చనిపోయేవరకు దేవునికి వినబడనివ్వరా? యేసు తన శిష్యులకు ప్రార్థన నేర్పారన్నది మరిచారా? మిమ్మల్నే గుడ్డిగా నమ్మే విశ్వాసులకు ప్రార్థన చేసుకోమని ఇంకెప్పుడు చెబుతారు? అలా చెబితే మీ ఆదాయం పోతుందన్న వ్యాపారాత్మక ధోరణి మీచే అలా చెప్పనివ్వట్లేదా?

– బ్రదర్ వైకెయార్

(మరింత విశ్లేషణ వచ్చే పేపర్లో)

## రెండు తెలుగు రాష్ట్రాల్లోను పేరెన్నికగన్న అనేక సంఘాల్లో...

# యజమానుల్లా.. సంఘపెద్దలు!

చాకిరేవు

-ఎడిటర్

అనేక పెద్ద సంఘాలన్పించుకునే వాటిలో 'సంఘపెద్దలు' యజమానుల్లా ప్రవర్తిస్తుంటారని వినుట కడుశోచనీయం. కొన్ని చోట్ల అటువంటి సంఘాల్లో పాస్టర్లూ రాజకీయాలు నడుపుట అంతకంటే దౌర్భాగ్యం. పాస్టర్లు, సంఘపెద్దల్లో కొందర్ని తమవైపుకు త్రిప్పుకుని సంఘాల్లో అలజడులకు కారణమగుట మరింత హీనమైన సంగతి. అటువంటి సంఘాల్లో ఎక్కడో కొన్ని చోట్లే పాస్టర్ల హవా నడుస్తుంటుంది. కాని, సంఘపెద్దల హవా మాత్రం అనేక చోట్ల నడుస్తుండుట కంటికి కనబడే నిజం.

పెద్దలు సంఘస్తుల్ని శాసించే వారుగాను పరిణమించుట దారుణం. ఎన్ని సంవత్సరాలైనా వారు, వారి కుటుంబీకులదే పెత్తనం. సంఘంలో పెద్దలుగా ఉండేందుకు ఎందరికో అవకాశమున్నా వారికా పదవులు దక్కవు. ఏదో ఓ రకంగా ప్రలోభపెడుతూ పదవులను మాత్రం పదిలంగా కాపాడుకొంటుంటారని వింటుంటాం. అందుకు ఒక్కోసారి ధనం, లేకుంటే దండోపాయాన్ని వాడేందుకు వెనుదీయరని వినుట చాలా బాధాకరం. అటువంటి పెద్ద సంఘాలనిపించుకునే చోటికి ఓ నాలుగైదు వారాలు ఆరాధనకు వెళ్తే చాలు! వారిలో వారికి జరిగే గొడవలు సులువుగానే తెలుస్తాయి ఎవరికైనా! మీకేమైనా అనుభవముంటే అట్టి సంఘాల ఆరాధనలకు వెళ్లి చూడండి! అక్కడ దైవారాధనకు ప్రాధాన్యత తక్కువ.. ధన సంపాదనకు ప్రాకులాడుట ఎక్కువ కనబడుట తథ్యం! అలాంటి సంఘాల పెద్దలు, వారికి వత్తాసు పలికే విశ్వాసులు దేవునియందలి 'భయభక్తులు' కనబరిస్తే ఆ యా ప్రాంతాల్లో మరింకెందరో క్రీస్తు మార్గానికి వచ్చేందుకు అవకాశాలు మెండుగా ఉంటాయన్నది వాక్య ప్రేమికుల మరియు వాక్యాన్ని ఆచరణలో చూపేందుకు అహర్నిశలు కృషి చేస్తూ శ్రమిస్తున్న వారి ఆవేదన! అటువంటి సంఘపెద్దలు, విశ్వాసుల కొరకు ప్రార్థించాలన్నది వారి కోరిక కూడాను. ఏమంటారు?

మేం వ్రాసిందాన్నిబట్టి ఎవరికేమైనా అభ్యంతరాలుంటే.. రెండు రాష్ట్రాల్లోనుగల అనేక సంఘాలు, పెద్దల పేర్లతో సహా తదుపరి పేపర్లలో ప్రచురించేందుకు మేం సిద్ధం. ఎన్ని సంవత్సరాలైనా 'పెద్దల మార్పులేని' సంఘాలు ప్రతి జిల్లాలోను ఉన్నాయంటున్నారు విశ్వాసులెందరో! కావాలంటే ఎవరైనా పరీక్షిస్తే తెలుస్తుందా సంగతి! 'క్రైస్తవనాడు' ఏం రాసినా అవన్నీ నూరుపాళ్లూ నిజాలైతేనే రాస్తుంది. ఇది పాఠకులకు 'క్రైస్తవనాడు'పై గల నమ్మకం. దాన్ని ఎన్నటికీ మేం వమ్ము చేయం.

'పెద్దలు – కాపరుల' అంశంపై బైబిలేం చెప్పిందో లేఖనానుసారంగా రాబోవు పేపర్లలో వివరిస్తాం. చదవండి! లేఖనాన్ని బట్టి సరిచూడండి. తప్పు చేస్తున్న వారిని నిలబెట్టి ప్రశ్నించి సమాజానికి పట్టి అప్పగించండి. సరిచేసుకొనుటే క్రైస్తవ్యమని ఎలుగెత్తి చాటండి. సరిచేసుకొన్న వారందరూ దేవుని కృపకు మరింత పాత్రులవగలరు. తద్వారా దేవుని సేవ మరింత విస్తరిస్తుంది. విస్తరించాలన్నదే మన ప్రార్థన, జీవనం అయ్యిండాలి. ప్రార్థన వినే దేవున్నే మనం కలిగున్నాం. అందుకు 'దేవునికి స్తోత్రం'.

# పిరికితనము

- డా.జాయ్ చెరియన్
'యునైటెడ్ పీపుల్స్ ఫెలోషిప్',
రాం నగర్,
(హైద్రాబాద్)



భయము, పిరికితనము ప్రతి మానవునిలో స్వాభావికముగా ఉంటాయి గాని దైవశక్తి ద్వారా వాటిని జయించాలి. పిరికితనము నీలో ఉంటే నిన్ను బలహీనుడిగా, చేతకానివాడిగా, అసమర్థుడిగా చేస్తుంది. అందుకే నీలో నుండి పిరికితనము తొలగించుకోవాలి. కొందరు ప్రతి విషయమునకు భయపడుతుంటారు. పిరికివాడు దినమునకు వెయ్యిసార్లు చస్తాడట. విశ్వాసి పిరికివాడుగా ఉండకూడదు. దేనికీ భపపడకూడదు. దేవుడు మనకు శక్తియు ప్రేమయు ఇంద్రియ నిగ్రహముగల ఆత్మనే యిచ్చాడుగాని పిరికితనముగల ఆత్మనివ్వలేదు.

**'దేవుడు మనకు శక్తియు ప్రేమయు, ఇంద్రియ నిగ్రహమునుగల ఆత్మనే యిచ్చెను గాని పిరికి తనముగల ఆత్మ నియ్యలేదు.'** – 2తిమోతి 1:7.

నీ వ్యక్తిగల జీవితములో, కుటుంబ జీవితములో, సేవా జీవితములో సమర్థవంతముగా ఉండాలంటే పిరికితనమును తొలగించుకోవాలి. దేవునిబట్టి ధైర్యము తెచ్చుకోవాలి. దేవుని వాగ్దానములు, మాటలు జ్ఞాపకము చేసుకోవాలి. ఎప్పుడైతే దేవునిబట్టి ధైర్యము తెచ్చుకుంటావో అప్పుడు దేవుని శక్తి నిన్ను ఆవరిస్తుంది. మనము ఓడిపోయిన వారముగా ఉండము గాని అన్నిటిలో అత్యధిక విజయము పొందుతాము. పరిశుద్ధాత్మ దేవుడు నీకు సహాయ కుడిగా ఉండి నిన్ను బలపరుస్తాడు.

దావీదు భక్తుడు అతడికి కలిగిన శ్రమలో ఏడ్చుటకు శక్తిలేనంత బిగ్గరగా ఏడ్చాడు కాని తిరిగి దేవుని బట్టి ధైర్యము తెచ్చుకున్నాడు. శక్తి పొందాడు. అందుకే **'నేను యెహోవాయొద్ద విచారణచేయగా ఆయన నాకుత్తరమిచ్చెను. నాకు కలిగిన భయములన్నిటి లోనుండి ఆయన నన్ను తప్పించెను.'** – కీర్తనలు 34:4 అని అంటున్నాడు.

అన్యజనులకు సజీవుడైన జీవముగల నిజదేవుడు లేడు. దేవుని వాక్యము లేనందున సమస్యలతో తడబడతారు. శ్రమలలో దిక్కుతోచక వాటిని ఎదుర్కొనే మనోబలము, ధైర్యము లేక ఆత్మహత్య చేసుకుంటారు. పిరికివారే ఆత్మహత్య చేసుకుంటారు. ఆత్మహత్య పాపము. వారికి జీవితములో ఎదురయ్యే సమస్యలు తట్టుకోవడానికి శక్తి ఉండదు. రక్షింపబడిన దేవుని బిడ్డలకు, విశ్వాసులకు దేవునియందు గొప్ప నిరీక్షణ ఉంది. శ్రమలలో దేవుడు తోడైయుండి ఆ శ్రమలనుండి నిన్ను విడిపిస్తాడు. దేవుని సెలవు లేకుండ మన జీవితములో ఏదీ సంభవించదు. దేవుని ప్రేమించువారికి అనగా ఆయన సంకల్పము చొప్పున పిలువబడినవారికి సమస్తము సమకూడి జరుగుతాయి. గనుక దేనికీ భయపడే అవసరములేదు. దేవుని సెలవు లేకుండా నీ తలవెంట్రుకలలో ఒక్కటైనను నేలరాలదు. కాబట్టి నీ విశ్వాసయాత్రలో ధైర్యముగా ముందుకు సాగాలి.

**'నాయందు మీకు సమాధానము కలుగునట్లు ఈ మాటలు మీతో చెప్పుచున్నాను. లోకములో మీకు శ్రమ కలుగును; అయినను ధైర్యము తెచ్చుకొనుడి, నేను లోకమును జయించి యున్నాననెను.'**

– యోహాను 16:33

ఒకసారి వార్తాపత్రికలో ఒకవార్త చదివాను. తల్లి, ఇద్దరు ఆడపిల్లలతో పెద్ద భవనములో ఉంటున్నారు. వారు ధనవంతులు. వారికి ఏ కొదువలేదు. కొద్ది కాలము క్రితము ఆ యింటి యజమానుడు గుండె పోటుతో మరణించాడు. అప్పటి నుండి వారు భయభ్రాంతులకు లోనై పిరికితనముతో ఇంటినుండి బయటకు రాకుండ ఎవరితో కలువకుండ తలుపులు బిగించుకొని లోపలే ఒంటరిగా ఉండేవారు. ఇంట్లో ఉన్న చెత్త కూడ బయట పడవేసేవారు కాదట. ముగ్గురూ ఆహారం లేకుండ కృంగిపోయి చివరకు చనిపోయారు. పిరికితనమనే దయ్యపు ఆత్మచేత బందీలయిపోయి చనిపోయారు. ఇరుగు పొరుగు వారు వారు కనబడటము లేదనుకుంటుండగా ఆ భవనము నుండి కుళ్లిపోయిన మురుగు వాసన వస్తుండగా వెళ్లిచూస్తే వారి దేహములు కుళ్లిపోయి వాసన కొడుతున్నాయి. వారు తమ సూసైడ్‌నోట్‌లో మాకు అన్నీ ఉన్నాయి గాని జీవితములో బ్రతికే ధైర్యము లేదని వ్రాసారట. పిరికితనముతో ప్రాణములు తీసుకున్నారు. దేవుని కలిగిన మనమెంత ధన్యులము! ఎంతో మంది రక్షింపబడిన దేవుని బిడ్డలు వారి భర్తలను కోల్పోయినా అధైర్యపడక నిరాశ, నిస్పృహలకు లోనవకుండ; నన్ను సృష్టించినవాడు నాకు భర్తయై యున్నాడని ధైర్యము తెచ్చుకొని జీవిత ప్రయాణములో ముందుకు సాగిపోతున్నారు. తల్లి దండ్రియై పిల్లలను పోషిస్తున్నారు. దైవకార్యములు చేస్తున్నారు. విశ్వాస ముతో సాగిపోతున్నారు.

దేవుడు నీకు సేవా దర్శనమిస్తే కావలసిన వనరులనిస్తాడు; కుటుంబమునిస్తే దానిని చక్కగా నడిపించే శక్తి, సామర్థ్యమునిస్తాడు. పిల్లలను ఇస్తే వారిని పోషిస్తాడు. నీ మధ్య నీ పిల్లలను ఆశీర్వదిస్తాడు. నీకు ఏ కీడు తగులదనే విశ్వాసముతో ధైర్యముగా ఉండాలి. యేసుప్రభువు పునరుత్థానుడై ఆరోహణమగునప్పుడు – మీరు పరిశుద్ధాత్మ శక్తిని పొందే వరకు యేరూషలేములో కనిపెట్టి యుండుమని శిష్యులకు చెపుతాడు. ఎందుకంటే పరిశుద్ధాత్మ శక్తి లేకపోతే ఓడిపోతాము. సేవ చేయాలన్నా, సంఘము నడిపించాలన్నా, కుటుంబమును నడిపించాలన్నా నీకు పరిశుద్ధాత్మ శక్తి ఎంతో అవసరం. నీ జీవితములో ఎదురయ్యే నిందలు సహిస్తూ, అవమానములు భరిస్తూ, ఆటంకములు పడద్రోస్తూ ధైర్యముగా దేవుని చిత్తము నెరవేర్చాలంటే పరిశుద్ధాత్మతో నింపబడాలి. మనుష్యులు పెట్టే నిందలకు భయపడితే ముందుకు సాగలేవు. పిరికితనము నీలో ఉంటే ఏ పని చేయలేవు. ఉపద్రవములు, నిందలు, హింసలు, కరవు, రోగము ఏదైనా ధైర్యముగా ఎదుర్కోవాలి. కొందరికి అనారోగ్యత సంభవిస్తే ఈ రోగము చంపివేస్తుందని భయపడతారు. భయపడకుండ ప్రార్థన చేయాలి. స్వస్థత దేవునియొద్ద నుండే వస్తుంది. సర్వశక్తిగల దేవుడు, స్వస్థపరచే దేవుడు చిన్న రోగమైన, పెద్ద రోగమైన నిన్ను స్వస్థపరుస్తాడు. ఆయనకు అసాధ్యమైనది, ఆయన శక్తికి మించిన కార్యమేదీ లేదని గ్రహించాలి. ధైర్యముగా ఉండాలి. సమస్యల నుండి తప్పించుకొని పారిపోవడము కాదు. కాని సమస్యలలో ధైర్యముగా నిలబడి వాటిని పరిష్కరించుకొనే శక్తిని పొందాలి. ఈ లోకములో మీకు శ్రమ కలుగుతుంది. అయినను ధైర్యము తెచ్చుకొనుడి; లోకమును జయించిన జయశాలియైన ప్రభువు మనతో ఉండగా భయమెందుకు? పిరికివాడు దేవుని కయిష్టులు. పిరికివాడు దేవుని రాజ్యములో ప్రవేశించరు. కాబట్టి క్రీస్తు యొక్క మంచి సైనికునివలె ధైర్యముతో ముందుకు సాగాలి.

**'క్రీస్తుయేసు యొక్క మంచి సైనికునివలె నాతోకూడ శ్రమను అనుభవించుము.'** – 2తిమోతి 2:3. అని అపో.పౌలు తన ఆత్మీయ కుమారుడైన తిమోతిని ఆదేశిస్తున్నాడు. సైనికులు ఏ విధముగా దేశరక్షణ కొరకు పోరాడటానికి సిద్ధముగా ఉంటారో అలాగే విశ్వాసలు ప్రభువు యొక్క మహాశక్తిని బట్టి అపవాదిని ఎదురించుటకు క్రీస్తు యొక్క మంచి సైనికుని వలె పోరాడుతూ ధైర్యముగా సాగిపోవాలి.

**'పిరికివారును, అవిశ్వాసులును, అసహ్యులును, నరహంతకులును, వ్యభిచారులును, మాంత్రికులును, విగ్రహారాధకులును, అబద్ధికులందరును అగ్నిగంధక ములతో మండుగుండములో పాలుపొందుదురు; ఇది రెండవ మరణము.'** – ప్రకటన 21:8.

నరకమునకు వెళ్లేదారి జాబితాలో మొదట పిరికివారే ఉన్నారు. పిరికివారు అగ్నిగంధకములతో మండు గుండములో పడతారు. దేవుని దృష్టిలో పిరికితనము మహాపాపము. గొప్పదేవుడిని కలిగియుండి, పిరికివారుగా ప్రతి విషయమును అనుమానిస్తే దేవునికి వ్యతిరేకముగా పాపము చేసినట్లే అవుతుంది. దేవునిపై అచంచలమైన విశ్వాసముంటే నీలో పిరికితనముండదు. అసాధ్యమైన కార్యములను కూడ దేవుడు సాధ్యపరుస్తాడు అని నమ్మాలి. దేవుడి చిత్తానుసారమైన ప్రతి ప్రార్థనకు ఆయన జవాబిస్తాడని విశ్వసించి, ప్రార్థించాలి.

**'ప్రియులారా, మిమ్మును శోధించుటకు మీకు కలుగుచున్న అగ్నివంటి మహాశ్రమనుగూర్చి మీకేదో యొక్క వింత సంభవించునట్లు ఆశ్చర్యపడకుడి. క్రీస్తు మహిమ బయలుపరచబడినప్పుడు మీరు మహానందముతో సంతోషించు నిమిత్తము, క్రీస్తు శ్రమలలో మీఉ పాలివారై యున్నంతగా సంతోషించుడి. క్రీస్తు నామము నిమిత్తము మీరు నిందపాలైనయెడల మహిమస్వరూపియైన ఆత్మ, అనగా దేవుని ఆత్మ, మీమీద నిలుచుచున్నాడు గనుక మీరు ధన్యులు.'** – 1పేతురు 4:12-14

ఈ లోకములో శ్రమలు తప్పక కలుగుతాయి. శ్రమలలో పిరికితనముతో భయపడక ధైర్యముగా ఉండాలి. దేవుడు శ్రమలలో మనలను ఒంటరిగా వదిలిపెట్టడు. షద్రకు, మేషాకు, అబేద్నెగోలను అగ్ని గుండములో పడవేసినప్పుడు నాలుగవ వ్యక్తిగా దేవుడు వారి మధ్య ఉండి అగ్నివాసన అంటకుండ వారిని కాపాడాడు. దేవుని బట్టి విశ్వాసులు ధైర్యము తెచ్చుకోవాలి. ప్రతి దానికి భయపడవద్దు. భయపడుట వలన మనుష్యులకు ఉరి వస్తుంది. యెహోవాయందు నమ్మకముంచువారు సురక్షితముగా ఉంటారు. ఏది జరుగుతుందని నీవు భయపడతావో అదే నీకు జరుగుతుంది. జాగ్రత్త!

**'ఏది వచ్చునని నేను బహుగా భయపడితినో అదియే నాకు సంభవించుచున్నది. నాకు భీతి పుట్టించినదే నామీదికి వచ్చుచున్నది.'** – యోబు 3:25.

మనము దేవునికే భయపడాలి. మరి దేనికీ భయపడకూడదు. పిరికివాడు రోజుకు వెయ్యిసార్లు చనిపోతాడు గాని నీతిమంతుడు, ధైర్యవంతుడు ఒక్కసారే చనిపోతాడు. విశ్వాసులకు మరణము కూడ పరలోకమునకు వెళ్లడానికి మార్గమైపోతుంది. శరీరము మట్టిలో కలిసిపోతుంది గాని ఆత్మ దేవుని యొద్దకు వెళుతుంది. విశ్వాసి మరణమునకు భయపడకూడదు.

ఒకరోజు ఒక తల్లి నాకు ఫోన్ చేసి – అమ్మా, మీరు నా కొరకు ప్రార్థించాలి, నేను చనిపోతానేమోనన్న భయం నన్ను కృంగదీస్తుంది అని భయపడుతూ చెప్పింది. నేను గృహమునకు వెళ్లి తలుపు తట్టినప్పుడు పనిమనిషి తలుపు తీసింది. ఆ తల్లి బెడ్‌రూమ్‌లో ఒక మూలకు భయముతో వణికిపోతు కూర్చొని యున్నది. ఆమెకు భర్త లేడు. పిల్లలు ఉద్యోగరీత్యా దూరముగా ఉంటున్నారు. ఈ తల్లి ఎందుకు భయపడుతుందంటే – నేను చనిపోతే నా ఆస్థి అంతా ఎవరి వశమవుతంది? నాకెవరూ లేరు నేను ఒంటరిగా ఉన్నానని దిగులుపడుతుంది. నేను నూనెరాసి ప్రార్థించి ఆమెను కౌన్సలింగ్ చేశాను. దేవుడు ఆమెకు విడుదల ఇచ్చాడు. దేవునికి స్తోత్రం! దేవుడు ఈ లోకమునకు వెలుగుగా ఉండాలని విశ్వాసులను నియమించాడు. ప్రార్థనతో దేవుని వాక్యముతో ఇతరులలో ఉన్న భయమును పారద్రోలాలి గాని మనమే భయపడితే ఎలా? పిరికివారు దేవుని శక్తిని ఆశ్రయించరు గాని కలవరముతో మంత్ర శక్తుల తట్టు, శకునగాండ్ర తట్టు తిరుగుతుంటారు. అయ్యో, అట్టివారికి శ్రమ అని దేవుని వాక్యములో ఉంది. యెహోవాను విడిచి వేరొకని అనుసరిచువారికి శ్రమలు విస్తరిస్తాయి. కాబట్టి పిరికితనము నీలో ఉంటే తొలగించుకోవాలి. దేవుడు మనకు శక్తియు ప్రేమయు ఇంద్రియ నిగ్రహముగల ఆత్మ నిచ్చాడు.

పిరికివారు పరిశుద్ధాత్మతో నింపబడితే దేవుని కొరకు గొప్ప కార్యములు చేస్తారు. పేతురు యేసుప్రభువుతో $3^{1/2}$ సంవత్సరాలు నడిచాడు గని ప్రభువు సిలువ దగ్గర నిలువలేక యూదులకు భయపడి పారిపోయాడు. ప్రభువు ఎవరో నాకు తెలియదు, నేను అతనిని ఎరుగనే ఎరుగనని ముమ్మారు బొంకాడు. ప్రభువు పునరుత్థానుడయ్యాడని మరియ చెప్పినప్పుడు సమాధి దగ్గరకు వచ్చి చూసి వెళ్లిపోతాడు. ప్రాణభయముతో దాగియుంటాడు. అలాంటి పిరికి పేతురు పరిశుద్ధాత్మ చేత నింపబడినప్పుడు అనేకమైన గొప్ప కార్యములు చేశాడు. ఏ యూదులకు భయపడి పారిపోయాడో ఆ యూదులకు ధైర్యముగా సువార్త ప్రకటించాడు. పేతురు ప్రసంగమునకు ఐదువేల మంది రక్షింపబడ్డారు. యేసుక్రీస్తు నామములో తప్ప మరి ఏ నామములో రక్షణ లేదని నిర్భయముగా ప్రకటిస్తున్నాడు. ప్రభువు కొరకు హతసాక్షిగా మారిపోయాడు. సిలువ దగ్గర నిలబడటానికి భయపడినవాడు ప్రభువు కొరకు తలక్రిందులుగా సిలువ వేయబడ్డాడు. పరిశుద్ధాత్మతో నింపబడితే దేవుకీ భయపడవు. పరిశుద్ధాత్మ సహాయం ద్వారా గొప్ప కార్యములు చేస్తావు.

**'యెహోవా దూత వచ్చి అబీయెజ్రీయుడైన యోవాషునకు కలిగిన ఒఫ్రాలోని మస్తకి వృక్షము క్రింద కూర్చుండెను. యోవాషు కుమారుడైన గిద్యోను మిద్యానీయులకు మరుగైయుండునట్లు గానుచాటున గోధుమలను దుళ్లగొట్టుచుండగా, యెహోవా దూత అతనికి కనబడి – పరాక్రమముగల బలాఢ్యుడా, యెహోవా నీకు తోడైయున్నాడని అతనితో అనగా.'**

– న్యాయాధి. 6:11,12

దేవుని చేత ఏర్పాటైన గిద్యోను శత్రువులకు భయపడి గానుగ చాటున గోధుమలను దుళ్లగొడుతున్నాడు. శత్రువులను ఎదుర్కొనే ధైర్యము లేక పిరికివాడుగా ఉన్న గిద్యోనుకు యెహోవా దూత కనబడి పరాక్రమము గల బలాఢ్యుడా అంటూ పిలుస్తున్నాడు. యెహోవా అతనికి తోడైయున్నాడు. గనుక అతడు బలాఢ్యుడే. ఆయన బలహీనులకు బలమిచ్చే దేవుడు, శక్తిహీనులకు బలాభివృద్ధి కలుగజేసేవాడు. అందుకే నీ బలహీనతల తట్టుకాక దేవుని బలము తట్టుచూడాలి. అందుకే అపో.పౌలు – నన్ను బలపరచువానిని బట్టి నేను సమస్తము చేయగలను అంటున్నాడు. కావున దేనికీ భయపడక ధైర్యముగా ఉండాలి.

ఏలియా ప్రవక్త యెజెబెలు రాణికి భయపడుతున్నాడు. ఆమె అతని ప్రాణము తీస్తానని బెదిరిస్తుంది. ఏలియా ప్రార్థన చేస్తే ఆకాశము నుండి అగ్ని దిగివచ్చింది. $3^{1/2}$ సంవత్సరాలు వర్షము కురవకుండ ఆగిపోయింది. తిరిగి ప్రార్థించినప్పుడు వర్షము కురిసింది. ప్రకృతి మీద అధికారముగల గొప్ప ప్రవక్త ఒక స్త్రీకి భయపడి పారిపోతున్నాడు.

**'తాను ఒక దినప్రయాణము అరణ్యములోనికి పోయి యొక బదరీవృక్షముక్రింద కూర్చుండి, మరణాపేక్ష గలవాడై – యెహోవా, నా పితరులకంటె నేను ఎక్కువ వాడను కాను; ఇంతమట్టుకు చాలును, నా ప్రాణము తీసికొనుము అని ప్రార్థనచేసెను.'** – 1రాజులు 19:4

అంత గొప్ప ప్రవక్త ఇక చాలు నా ప్రాణము తీసుకోమని ప్రార్థన చేస్తున్నాడు. కాని దేవుని దూత అతని యొద్దకు వచ్చి ఆహారము ఇచ్చి అతనిని బలపరచి నీ శక్తికి మించిన ప్రయాణము నీకు సిద్ధముగా ఉంది. భయపడకుమని అభయమిచ్చి, ధైర్యపరుస్తాడు. ఒక్క పూట ఆహారము వలన 40 దినములు ప్రయాణము చేయడానికి దేవుడు శక్తి నిచ్చాడు. నిన్ను బట్టి కాదు నీలోనున్న దేవుని బట్టి ధైర్యము తెచ్చుకొని ముందుకు సాగాలి. నా ప్రాణము తీసుకో, చస్తే బాగుండు అని పిరికివారే అంటారు. అలాంటి పిరికి మాటలు పలుకకుండ నీ దేవుడెంత గొప్పవాడు, ఆయన శక్తి ఎంత గొప్పదో తలచుకొని అట్టి దేవుని కలిగిన నీవు ధైర్యముగా ఉండాలి. పిరికితనమును తొలగించుకోవాలి.

# ప్రపంచ ప్రార్థన దినం


బిషప్ ఎం.ఎ.పాల్

విశాఖలో ఈ యేటా 'ప్రపంచ ప్రార్థన దినం' జరిగింది. వివాదాల్లో పడి గత కొన్నేండ్లగా మూతపడిన 'గమ్ ఆడిటోరియం' అందుకు వేదికైంది. త్వరలో ఈ ఆడిటోరియం 'డి కన్వెన్షన్ సెంటర్'గా మారనుంది.

బిషప్ ఎం.ఎ.పాల్, బిషప్ ఎం.మోహనరావు, రెవ.డా.లూక్, రెవ.సిహెచ్.జార్జ్, రెవ.ఎం.ఆర్.మోహనరావులతోబాటు ప్రముఖ క్రైస్తవనాయకులు కోట సుబ్బారెడ్డి తదితరులు ప్రార్థించిన వారిలో ఉన్నారు. 'డి' కన్వెన్షన్ సెంటర్ అధినేత్రి, దివంగత క్రైస్తవ నాయకులు రెవ.డా.కె.డేవిడ్‌రాజు శ్రీమతి ఎస్తేర్‌రాణి కూడా ఈ కూటమిలో పాల్గొని ప్రార్థించారు.


బిషప్ ఎం.మోహనరావు


కోట సుబ్బారెడ్డి


రెవ. డా. లూక్


రెవ. సి.హెచ్. జార్జ్


రెవ. ఎం.ఆర్.జేమ్స్


రెవ.డా.జాన్ సుధాకర్


రెవ.జార్జ్‌బాబు


రెవ.ఎం.ఆర్.మోహనరావు


శ్రీమతి కె.ఎస్తేర్ రాణి

## 'డి - కన్వెన్షన్ సెంటర్'గా 'గమ్ ఆడిటోరియం'!

డా.కె.ఎ.పాల్ డేవిడ్‌రాజుల మధ్య ఏర్పడిన వివాదాల వల్ల గత కొన్నేండ్లగా మూత పడిన 'గమ్ ఆడిటోరియం' ఇకపై 'డి - కన్వెన్షన్ సెంటర్'గా మారనుంది. ప్రభువు కృపతో వివాదాలు సమసిపోయాయని, ఇకపై ఎవరైనా ఈ 'డి కన్వెష్షన్ సెంటర్'ను వాడుకొనే అవకాశముందన్నారు ప్రెసిడెంట్ కిలారి ఎస్తేర్ రాణి. ఇకపైనైనా నగర నడిబొడ్డునున్న ఈ ఆడిటోరియం ప్రభువును మహిమపరచే విధంగా వాడబడాలని విశాఖ క్రైస్తవులు కోరుతున్నారు.






## డా.ఎ.ఆర్.స్టీవెన్‌సన్

# సంగీత పండుగలు


డా.ఎ.ఆర్.స్టీవెన్‌సన్

**మే 12, యలమంచిలి, విశాఖజిల్లా :** యలమంచిలి స్కూల్ గ్రౌండ్‌లో డా.ఎ.ఆర్.స్టీవెన్ 'సంగీత పండుగలు' మూడురోజులు జరిగాయి. స్థానిక కాపరి కింగ్ సాల్మన్ తల్లి శ్రీమతి కృపావరం కార్యక్రమానికి ఆద్యంతం సహకరించారు. మరణంలోనుంచి ప్రభువు ఆమెను లేపినందుకు కృతజ్ఞతగా ఆమె, ఆమె కుటుంబీకులు ఈ సభలు జరిగించారు. ముఖ్య ప్రసంగానికి అడ్డురోడ్డులోగల 'క్రైస్ట్ సాల్వేషన్ చర్చి' కాపరి రెవ.డా.బి.డేవిడ్ కిరణ్ కుమార్ ఆహ్వానించబడ్డారు. ఎవరూ చర్చించ సాహసించని 'ఏశావు' జీవితాన్ని గురించి ఆయన వివరిస్తూ అందర్నీ హెచ్చరించిన విధానానికి కాపర్లు, విశ్వాసులు ఆశ్చర్యచకితులయ్యారు. ఆ వివరణ రాబోవు 'క్రైస్తవనాడు'ల్లో ఓ పాఠ్యాంశంగా చదువగలరు.

రెవ.డా.ఎ.ఆర్.స్టీవెన్‌సన్ తన బృందంతో క్రీస్తు ప్రేమను చాటుతూ అందర్నీ అలరించారు. వీనులవిందైన సంగీతం అందర్నీ ఆకట్టుకొంది. పాడుతూనే విశ్వాసుల్ని మధ్యమధ్యలో ప్రశ్నిస్తూ ఎవేర్‌నెస్ చేసే ఆయన విధానం ఇక్కడా కొనసాగింది. తాను పాడుతు విశ్వాసులచే కూడా పాడించే ఆయన శైలి ప్రస్తుత పరిస్థితులకు తగినట్లే ఉందని అక్కడి కాపర్లు, విశ్వాసలు తమ సతోషాన్ని వ్యక్తపరచారు.


రెవ.డా.బి.డేవిడ్‌కిరణ్ కుమార్

# పాస్టర్ రాజ్‌కుమార్‌కు మాతృవియోగం!




పాస్టర్ రాజ్‌కుమార్


పాస్టర్ శివ శంకర్ లాజరస్


బ్రదర్ ఎ.రాజ్‌కుమార్

**16 మే, విశాఖ :** విశాఖలో ప్రముఖ న్యాయవాది మరియు పాస్టర్‌గా సేవలందిస్తున్న రాజ్‌కుమార్ తల్లి 'భక్తుల జయనమ్మ' ఈ నెల 16వ, తేదీన ప్రభువునందు నిద్రించారు. జ్ఞాపకార్థ కూటమి 20వ, తేదీన జరిపారు. పాస్టర్ సామ్యేల్ ప్రసంగించారు. డా. జాన్ రాబర్ట్‌బడే, పాస్టర్ శివశంకర్ లాజరస్, బ్రదర్ ఎ.రాజ్‌కుమార్ తదితరులు ఆమెను గుర్తుచేసుకున్నారు. పాస్టర్ రాజ్‌కుమార్ తన తల్లిని గురించి మాట్లాడుతూ ఆమె నా అన్నను అక్కను నన్ను పెంచేందుకు ఎన్ని పాట్లు పడిందో గుర్తుచేసుకుంటుంటే... అంటూ దు:ఖభరితులై కన్నీటిపర్యంతమై కాసేపు ఏమీ చెప్పలేక ఆగిపోయారు. ఆమె తమ యెడల చూపిన ప్రేమ, ఆమె చేసిన ప్రార్థనలే మా కుటుంబానికి దీవెనలు తెచ్చాయని ఆయనన్నారు. ముగింపులో ఆమె మనుమడు స్టాన్లీ కుటుంబం తరపున అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.